# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

**వార్త**

సోమవారం 17 అక్టోబర్ 2022


## నేటి నుంచి హజరత్ రఖీబ్‌షావలీ దర్గా 162వ ఉరుసు మహోత్సవాలు ప్రారంభం

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



స్థానిక మోచంపేట దర్గా నగర్‌లో వెలసిన హజరత్ రఖీబ్ షావలలీ (ర.అ) సాహెబ్ వారి 162వ ఉరుసు ఉత్సవా లు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమవు తాయని దర్గా కమిటీ కా ర్యదర్శి సలీం తెలిపారు. 17వ తేదీ రాత్రి గంధోత్సవ మహోత్సవంతో ప్రారంభమవు తుం దన్నారు. 18వ తేదీ రాత్రి ఉరుసు మహోత్సవం జరుగుతుందన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా జరిగే ఉత్సవాల్లో ప్రజలందరూ పాల్గొని స్వామి వారి కృతపకు పాత్రులు కావాలని కోరారు.

## పెన్నానదిలో ఇద్దరు యువకులు గల్లంతు

**ప్రొద్దుటూరు అక్టోబర్ 16, ప్రభాతవార్త**



ఎగువన కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని డ్యాములు, నదులు జలకల సంతరించుకోగా పెన్నానది పూర్తి నీటిమట్టంతో కళకళ లాడుతోంది. ఇదిలా ఉండగా, ఆదివారం సాయంత్రం పెన్నా నదిలో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే ప్రొద్దుటూరు లోని త్యాగరాజ కళ్యాణ మండపం వద్ద గల పెన్నా నది పరివాహక ప్రాంతంలో ఈత సరదా ఇద్దరు యువకుల ప్రాణం తీసింది. సాయంత్రం ఐదు గంటల పదిహేను నిమిషాల ప్రాంతంలో, ఈత కోసమని వచ్చిన ఇద్దరు యువకులు వడ్లపల్లి వసంత్ కుమార్ (22 సం) ఆదర్శ కాలనీ, తలారి కార్తీక్(24 సం) రాయచోటి ఈత కోసమని పెన్నానదిలోకి దిగారని ప్రత్యక్ష సాక్షుల కథనం. ఈత కొడుతున్న సమయంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్నానదిలో వీరు గల్లంతయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక శాఖ వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రాత్రి 7:00 గంటలు అవుతున్న వారి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. కావున సోమవారం ఉదయం నుండి సెర్చ్ ఆపరేషన్ మొదలవుతుందని అగ్నిమాపక శాఖ అధికారి రఘునాథ్ తెలిపారు.

# అభివృద్ధి సంక్షేమానికి మారుపేరు జగనన్న

**మూడేళ్ళలో 98 శాతం హామీలును నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుంది**



**చిన్నమండెం, అక్టోబర్ 16ప్రభాతవార్త:**

అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని మాట తప్పని నాయకుడిగా స ంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయడంలో దేశానికే జగనన్న ఆదర్శంగా నిలుస్తున్నారని రాయచోటి అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సిపి అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లె సచివాలయ పరిధిలోని కూతలవాండ్లపల్లె, నడిగడ్డ, మూలపల్లె, కాలాడి వాండ్లపల్లె, నడిగడ్డ, కుమ్మరపల్లెలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మెన్ దేవనాథరెడ్డితో కలసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫథకాలు అందుతున్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పల్లె పల్లెనా శ్రీకాంత్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్రలా నిలిచి పోయాయన్నారు. ప్రజాధరణలో తండ్రికి మించిన తనయుడిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారన్నారు. జడ్పీ మాజీ ఛైర్మెన్ దేవనాథరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందన్నారు.



**వైఎస్సార్ చేయూతతో మా భవిత మారుతోందన్నా.....**

సిఎం జగనన్న అందిస్తున్న వైఎస్సార్ చేయూతతో తమ భవిత మారుతోందంటూ అక్కా చెల్లెమ్మలు సంతృప్తి వ్యక్తం చేశారు. చేయూత ద్వారా ఇస్తున్న ఆర్థిక సహాయంతో చిన్న వ్యాపారాలు, ఆవులు, పొట్టేళ్ల పెంపకం వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని తెలిపారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాల మాఫీని అమలు చేస్తున్నారన్నారు. మహిళలకు అన్ని రంగాలలో యాభై శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. నడిగడ్డపల్లె నుంచి కూతలవాండ్ల పల్లె వరకు సిసి రోడ్డు, కుమ్మరపల్లెకు వెళ్లు రహదారిలో కల్వర్టులతో కూడిన రహదారి నిర్మాణం, నడిగడ్డపల్లెలో అదనపు సింటెక్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డి తెలి పారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, వైసిపి నాయకులు రమణారెడ్డి, బాబురెడ్డి, నాగేశా రెడ్డి, ఎంపిటిసిలు గంగులయ్య, రమేష్, వెంకటప్ప నాయుడు, సర్పం చ్‌లు కృష్ణమ్మ, నజీర్ అహ్మద్, వైసిపి నాయకులు శివారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీరాములు, మండిపల్లి శిరీష్‌రెడ్డి, రమణ, ఆనంద్, జనప్ప రెడ్డి, రాము, సలీం, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది వాలంటరీలు పాల్గొన్నారు.

# తాళ్లపాకలో ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌పై కొరడా



- ఎఫ్ఐఆర్ నమోదుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా ఆదేశాలు
- దొంగలెవరు? దొరలెవరు? సహకరించిన అధికారులెవరు?
- రూ.6 కోట్ల విలువైన సర్కార్ భూములు అమ్మిన వైనం

**రాజంపేట అర్బన్, అక్టోబరు 16 ప్రభాతవార్త**




పదకవితా పితామహుడు అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో ప్రభుత్వ భూములనే అక్రమంగా అమ్మిన అవినీతి వ్యవహారంపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా కొరడా ఝులిపించారు. అక్రమార్కులపై ఎఫ్ఐఆర్ నమోదుకు పోలీసు కేసు నమోదుకు ఆదేశాలు జారీ చేశారు. రాజంపేట రెవెన్యూలో సంచలనం సృష్టించిన ప్రభుత్వ భూములను దర్జాగా అమ్ముకొంటూ రిజిస్ట్రేషన్ చేసుకొంటున్న భూబాగోతంపై జిల్లా అధికార యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఖబడ్దార్ అనే సంకేతాలు అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. ఈ ప్రభుత్వ భూమి అమ్మకాలకు సంబంధించిన భూదందాపై 'వార్త' ప్రచురించిన వరుస కథనాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం కఠినచర్యలకు దిగినట్లు తెలుస్తోంది. కాగా వార్త దినపత్రికలో గతనెల 12న 'దర్జాగా భూకబ్జా' కథనం వెలువడిన విషయం తెలిసిందే. అలాగే సెప్టెంబరు 16న 'తాళ్లపాకలో మరో భూదందా' సెప్టెంబరు 19న 'తీగ లాగితే డొంక కదిలింది' మరో కథనం ప్రచురించడం జరిగింది. అదేవిధంగా సెప్టెంబరు 21న వార్త ప్రధాన సంచికలో 'రూ.6 కోట్ల సర్కారి భూముల స్వాహా శీర్షికన మరో కథనం ప్రచురించడం జరిగింది. ఈ వార్త కథనాలపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారు. కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమించడాన్ని సీరియస్‌గా పరిగణించారు. సమగ్ర విచారణకు ఆదేశించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన భూభాగోతంపై 'డ్రోన్ సర్వే' చేయాలని రాజంపేట తహశిల్దారును ఆదేశించారు. ఈ మేరకు రాజంపేట తహశిల్దారు డ్రోన్ సర్వే చేశారు. ఇంతలో వార్త దినపత్రికలో తాళ్లపాకలోని సర్వేనంబరు 1076లో 2.20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా ప్లాట్లుగా వేసి అమ్ముకొంటున్నారని వార్త కథనం ప్రచురించడం జరిగింది. ప్రభుత్వ భూమిని మొదట తిరుపతి జిల్లా రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తాళ్లపాక విఆర్ఒ సంతకాన్ని ఫోర్జరి చేసి ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. అక్కడ ప్రధాన డాక్యుమెంట్‌ను పుట్టించారు. 4225 డాక్యుమెంట్ నంబరు సహాయంతో రాజంపేటలో 2.20 ఎకరాల భూమిని 24 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు చేసుకొన్నారు. వార్త కథనంపై ఆధారంగా రాజంపేట తహశిల్దారు ముద్దా సుబ్రమణ్యంరెడ్డి మొత్తం సమగ్ర సమాచారాన్ని సేకరించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రికార్డు తెప్పించుకొన్నారు. సర్వేనంబరు 1076/5 లోని ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్లు జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపారు. జిల్లా కలెక్టర్ కూడ రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. ప్రభుత్వ భూమిని ఎలా రిజిస్ట్రేషన్ చేశారు? ఎవరు సహకరించారు? విఆర్ఓ సర్టిఫికెట్ అక్రమార్కులకు ఎవరు ఇచ్చారు? అసలు విఆర్ఓ భూ ఆక్రమణదారులకు సర్టిఫికెట్ ఇచ్చారా లేదా? రెవెన్యూ రికార్డులు అడంగల్, 1బి, ఆర్ఎస్ఆర్‌ను చూడకుండా ఎలా రిజిస్టర్ చేశారు? రేణిగుంటలో రిజిస్ట్రేషన్ చేస్తే రాజంపేటలో ఎలా ఆమోదించారు? 2.20 ఎకరాల విస్తీర్ణాన్ని రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారమే రూ. 1.17 కోట్ల విలువైన (మిగతా IIవ పేజీలో)

# దేశాన్ని బాల్య వివాహ రహితంగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయం

**గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సోలమన్‌రాజు**







**కడప అక్టోబర్ 16, ప్రభాతవార్త**

దేశాన్ని బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దడం మనందరి సామాజిక బాధ్యత అని.. గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. సోలమన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, న్యాయ శాఖల ఆధ్వర్యంలో.. "భేటి బచావో -భేటీ పడావో" నినాదంతో బాల్య వివాహాలను అరికట్టాలని.. స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ నుండి కోటిరెడ్డి సర్కిల్ వరకు మహిళలు, బాలికలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా.. గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. సోలమన్ రాజు తోపాటు గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఇంచార్జ్ సెక్రటరీ కృష్ణన్ కుట్టి లు హాజరై.. క్యాండిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. సోలమన్ రాజు మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ, బాలికల విద్యాభివృద్ధి తోనే... దేశం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. ముఖ్యంగా బాల్యవివాహాల వలన మైనర్ బాలురు, బాలికల జీవితంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొనాల్సిన పరిస్థితులు ఎదురవవుతాయన్నారు. అభం శుభం తెలియని వయస్సులో వైవాహిక బంధాలు బలంగా వుండవన్న నిజాన్ని తల్లిదండ్రులు గ్రహించి బాల్య వివాహాలను ప్రోత్సహిం చడం మానుకోవాలన్నారు. ముఖ్యంగా బాలికలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదురొనాల్సిన పరిస్థితులు ఎదురవుతాయన్నారు. సంపూర్ణ మహిళా సాధికారిత సాధించాలంటే.. బాలికలు విద్యావంతులు కావాలని, అమ్మాయిలకు 18 సంవత్స రాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే.. వారికి వివాహం చేయా లన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తెరగాలన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాజాన్ని చైతన్య పరిచేందుకు మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందన్నారు. ఆడ పిల్లలకు రక్షణ కల్పించడంతో పాటు, ప్రతి ఆడపిల్ల బడికి వెళ్లి విద్యను అభ్య సించేలా చూడాలన్నారు. అలాగే బాల్య వివాహాలను అరికట్టడంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖలు సమన్వయంతో ప్రధాన భూమిక పోషించాలన్నారు. బాలికలు విద్యావంతులయితే.. వారి మానసిక పరి పక్వత పెరగడంతో పాటు కుటుంబం అంతా విద్యావంతులవుతారన్నారు. తద్వారా మహిళా సాధికారత కూడా సాధ్యం అవుతుందన్నారు. బాలికలను రక్షిద్దాం... బాలికలను చదివిద్దాం..! అనే నినాదంతో కూడిన ప్రభుత్వ పథకం వంద శాతం విజయవంతం చేయడం సమాజంలో అందరి బాధ్యతగా పేర్కొన్నారు. బాలికల రక్షణ విషయంలో సమాజంలో ఇంకా చాలా మార్పు రావాల్సి ఉందన్నారు. ఆత్మ స్థైర్యంతో బాలికలు ముందడుగు వేసేలా ప్రతిఒక్కరూ ప్రోత్సహించా లన్నారు. మన చుట్టూ వున్న సమాజంలో ఎక్కడైనా.. బాల్య వివాహాలు జరుగు తున్నట్లు సమాచారం అందినా.. ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఆ దిశగా అన్ని శాఖల అధికారులు, మీడియా సహకరించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మెప్మా అంగన్వాడీ కార్యకర్తలు, కౌమార బాలికలు, ఎన్జీవో ప్రతినిధులు, సంబందిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్భాటంగా మొదలై అర్ధాంతరంగా ఆగిన డ్రైనేజీ పనులు

- వర్షాకాలం కావడంతో మురికి కూపాలుగా దర్శనమిస్తున్న చెత్తా చెదారం..
- పనులు పూర్తి చేయాలంటున్న గ్రామస్థులు

**ఓబులవారిపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త:**



ఆర్భాటంగా మొదలు పెట్టిన డ్రైనేజీ కాలువ పనులు కొన్ని కారణాల వల్ల అర్ధాంతరంగా ఆగాయా? లేక పనులు నత్తనడకన సాగుతున్నాయా అంటూ మంగంపేట గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మురికి కాలువ నిర్మాణం పనులకు ఏపీ ఎండీసీ సంస్థ ద్వారా రూ.20లక్షలు పైచిలుకు నిధులు వెచ్చించి కొత్త మంగంపేట గ్రామంలో నుంచి వచ్చే మురికి నీరు హైవే రోడ్డుపైకి వెళ్తుండడంతో వాహన దారులు, పాదాచారులు ప్రయాణించాలంటే ఇబ్బందికరంగా ఉండడంతో కొంత మంది నాయకులు ఏపీఎండీసీ ఎండికి డ్రైనేజీ కాలువ పనులు చేపట్టాలని కోరడంతో ఎండీ వి.జి.వెంకటరెడ్డి స్పందించి ఏపీఎండీసీ నిధులను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో పనులు వేగవంతం చేయడంతో పాటు పలుచోట్ల వీధుల్లో నుంచి మురికి కాలువల్లోకి నీరు వచ్చేలా దారులు కూడా ఏర్పరచారు. అయితే కొన్ని నెలలుగా డ్రైనేజీ కాలువ పనులు పూర్తి కాక పనులు నత్తనకడన సాగ డంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాలం, ఆపైన మురికి కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో మురికి కాలువ నుంచి దుర్వాసన వెదజల్లుతూ మురికి కూపాలుగా కాలువలు దర్శనమిస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ప్రణాళికా లోపంతో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల ఉదాసీనతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. డ్రైనేజీ కాలువలు దోమలకు నిలయాలయ్యాయి. అసలే మంగంపేటలో సీజనల్ వ్యాధులు ప్రభులుతూ అక్కడ నివారించడం అసాద్యం. అందువల్ల డ్రైనేజి కాలువ పనులు పూర్తి చేయాలని పలువురు అంటున్నారు. సీజనల్ వ్యాదులు ప్రభలతాయోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నివారించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిద్రావస్థలో ఉంది. దీంతో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు దోమల కాటుకు గురై ఆసుపత్రుల ఖర్చులకు వేలకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి కోల్పోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులకు గురై సతమతమవుతున్నారు. గతంలో కూడా మంగంపేటలో మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరా లతో మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికీ ఏపీఎండీసీ సంస్థ మంగంపేట పంచాయతీకి వెచ్చిస్తున్నా అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అన్నీ ఏపీ ఎండీసీ సంస్థ ద్వారా మంగంపేటలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నప్పటికీ పంచాయతీ నిధులు ఏమవుతున్నాయని మంగంపేట ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటగా విద్య, వైద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నా అవి ప్రజలకు అందని ద్రాక్షలాగా మారాయనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి డ్రైనేజీ కాలువ పనులు పూర్తి చేసి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# కంపు బాబోయ్... కంపు

**మేజర్ పంచాయతిలో కానరాని పారిశుధ్యం**

**నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు**

**నందలూరు, అక్టోబరు 16 ప్రభాతవార్త**



నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతి లో ఏ కాలనిలోకి వెళ్లినా పరిసరాల్లో చెత్త తీసుకెళ్లే పారిశుధ్య కార్మికులు కరువయ్యారు. ప్రధాన రహదారిలో ట్రాక్టర్‌తో చెత్త సేకరణ చేస్తున్నారే తప్ప వార్డుల్లో చెత్తసేకరణ బండ్లు వచ్చి తీసుకెళ్లినా పాపానపోలేదు. దీనికితోడు ఇళ్లల్లోని చెత్తా చెదారం రోడ్డుపక్కనే వేస్తుండడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దుర్వాసన, దోమలతో ప్రజలు ఇక్కట్లపాలవుతున్నారు. పేరుకు మాత్రమే మేజర్ పంచాయతి. పన్నులు, వసూలు చేసేదానిపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యాలపై పారిశుధ్యంపై లేకపోవడం శోచణీయమని స్థానిక ప్రజలు అంటున్నారు. ఇంటి పన్ను, కుళాయి పన్నులు కట్టకపోతే పదిసార్లు వారి ఇళ్లచుట్టూ తిరిగి వసూలు చేసే సిబ్బంది చెత్త సేకరిం చడానికి మాత్రం వారానికోసారి వార్డుల్లో సంచరిస్తుండడం ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్నటువంటి వర్షాలకు, రోడ్డు పక్కన ఉన్నటు వంటి చెత్తవల్ల దోమలు రాజ్యమేలుతున్నాయి. అంటువ్యాధులతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రజారోగ్య సమస్యలపై పంచాయతి అధికారులు కాని, సిబ్బందికి కాని పట్టడంలేదు. రోడ్లు మరీ అధ్వాన్నంగా గుంతలమయమై చిన్నవర్షాలకే కుంటలను తలపిస్తున్నాయి. పంచాయతిలో ఉన్న సమస్యల గురించి వార్డుల్లో తిరిగినా పాపాన పోలేదు. కనీస రెండు రోజులకోసారైన తోపు డు బండి వచ్చి వార్డుల్లో చెత్తను సేకరిస్తే బాగుంటుందని ప్రజలు అంటున్నారు. ట్రాక్టర్ తీసుకొని ప్రధాన రహదారి గుండా మాత్రమే చెత్తను సేకరించడం, పంచాయతి అభివృద్ధిలో తామే ముందు ఉన్నామని చెప్పుకోవడం ఎంతవరకు న్యాయం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రజలకు విష జ్వరాలను కట్టడి చేయాలని సంబంధిత అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి వార్డుల్లో ఉన్న చెత్తను తీసివేసి బ్లీచింగ్ వంటివి నెలకోసారైన చల్లించాలని పంచా యతి ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

# సమస్యల సుడిలో 108 సర్వీస్

- కుయ్యి..కుయ్యి..అంటూ రావాల్సింది..
- గణనీయంగా తగ్గుతున్న ఎమర్జెన్సీ కేసుల నిర్వహణ
- పలు సర్వీసులకు టైర్ల సమస్య




**పీలేరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త :**

రోడ్డు ప్రమాదంలో గాయపడితేనో..గుండెనొప్పి లాంటి ఆకస్మిక ఆనారోగ్యాల్లోనూ, కాన్పు కష్టమై ఉన్నతస్థాయి వైద్యం అవసరమైనప్పుడో మేమున్నామంటూ కాల్ చేసిన వెంటనే కళ్ళముందుకు వచ్చి అపన్న హస్తం అందిస్తున్న 108 సర్వీసులు క్రమంగా సమస్యల సుడిలో పడుతున్నాయి. దీంతో సామాన్యులకు సేవలు కూడా అంతంత మాత్రంగానే లభిస్తున్నాయి. కాల్ చేసిన వెంటనే కుయ్యి..కుయ్యి మంటూ నిమిషాల్లో వచ్చే 108 అంబులెన్స్‌లు నేడు ఎప్పుడు ఫోన్ చేసినా ఏదో ఒక వాహన సమస్యను వారే మనకు వినిపించి ఆదుకునేందుకు హాజరు కాలేమని అయ్యో అంటూ ఆశ్చర్యంగా చెబుతున్నారు. దీంతో ప్రజలు, రోగులు అయోమయానికి గురు చేస్తున్నాయి. అయితే గతంలో లభించిన స్థాయిలో సేవలు మాత్రం కనుమరుగు అయ్యాయి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి మానసపుత్రికగా ఆవిర్భవించిన 108 వ్యవస్థను అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ప్రారంభించారు. అప్పటి నుంచి 2010వరకు సత్యం సంస్థ ఈఎంఆర్ఐ వ్యవస్థను నిర్వహించగా సత్యం సంస్థ పతనమైన తరువాత ఈవ్యవస్థను జివికె దక్కించుకొని దాదాపు 7సంవత్సరాలు పాటు సేవలను అందించింది. అప్పటి నుంచి జిల్లాలోనేకాకుండా మండల పరిధిల్లో కూడా వాహనాలు సేవలు అందించాయి. అప్పట్లో కూడా సమస్యలు ఉన్నా కాల్ చేసిన 10నుండి 18నిమిషాలలో గ్రామీణ ప్రాంతాలకు 22నిమిషాల్లోపు వాహనం చేరుకొని సేవలందేవి, అయితే ఇప్పుడు మాత్రం పలు అవ్యవసర సమయాల్లో ఫోన్ చేసిన బాధివతులకు సారీ సార్ మా వాహనానికి టైర్లు సరిగ్గా లేవు, అందుకే రాలేకపోతున్నామన్న సాధానాలు ఇటీవల ఎక్కువుగా వినిపించాయి. దీంతో పాటు ఏరోజుకు ఆరోజు వాహనంలో ఫుల్ ట్యాంక్ డీజల్ నింపుకుని సిద్ధంగా ఉండాల్సిన వాహనాలు కొన్నిసార్లు కాల్ చేస్తే డీజల్ అయిపోయింది. ఫుల్ చేసుకొని రావాలంటే గంట పడుతుంది. మీకు ఒకేనా అనే సమాధానలు కూడా వస్తున్నాయి. బాధితులను ఆవేదనాశ్యర్యాలకు గురిచేస్తొంది. వాహన సమస్యలు ఇలా ఉంటే కొద్ది నెలలుగా పైలెట్, ఈఎంటిలకు అవసరమైన గ్లౌజ్‌లు, ఎమర్జెన్సీ మందులు కూడా పూర్తి స్థాయిలో అందించడం లేదని కూడా ఆరోపణలు ఉన్నాయి. నెలకు ఐదు, ఆరు జతల గ్లౌజులతో సర్దుబాటు చేసుకునేలా నిర్వహణ సాగుతోందని తెలుస్తోంది. 108 వాహనాలు ఎదుర్కొంటున్న సమస్యలతో గతా నికి ఇప్పటికి సగానికి సగం మాత్రమే సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ఇంతటి అత్యవసర సర్వీసుల నిర్వహణపై జిల్లా ఉన్నతాధికారులు, వైద్యాధి కారులు కూడా తగిన రీతిలో స్పందించాల్సి ఉంది. నిర్వహణ కాంట్రాక్టు చేపట్టిన సంస్థ తగిన విధంగా చర్యలు చేపట్టి ప్రజలకు సేవలు అందించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 108 పైలెట్స్, ఈఎంటిలు, సిబ్బందికి వేతనాలు సక్రమంగా సరఫరాచేసి వారికి కావాల్సిన గ్లౌజులు, మందులు, అత్యవసర వస్తువులు అందజేసి సహకరించాలని వారు కోరుతున్నారు.

# పశువైద్యశాలలో పాడిరైతుల కష్టాలు

**ప్రభుత్వ వైద్యశాల పేరు - ప్రైవేటు మందులే దిక్కు**

**రైతులు అడిగితే కన్నెర చేస్తున్న డాక్టర్లు**

**వాల్మీకిపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త :**



వాల్మీకిపురంలోని పశువైద్య శాలలో పాడిరైతులు పడరాని పాట్లు పడు తున్నారు. ఒక్క పశువును తీసుకెలితే డాక్టర్లు వైద్యం చేస్తారే కాని మందులు మాత్రం ప్రైవేటుగా తీసుకోవాల్సిందేనటు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో మండలం లోని పాడిరైతులు ఆసుపత్రికి రావాలంటే జంకుతున్నారు. పేరుకు మాత్రమే ఏడి కార్యాలయం, మందులన్నీ ప్రైవేటు పరమంటూ ఏద్దేవా చేస్తున్నారు. వాల్మీకిపురం ప్రభుత్వ పశువైద్యశాలలో పేరుకు మాత్రం ప్రభుత్వ వైద్యశాల. పశువులకు వైద్యం అందాలంటే ప్రైవేటు మందులపై ఆదార పడాల్సిందే అని స్థానిక పాడి రైతులు వాపోతున్నారు. దీనిపై రైతులు ఏమిటి అని ప్రశ్నిస్తే అంతే మా ఆసుపత్రిలో లేవని సమాధానం. పశువులకు వైద్యం చేయించాలంటే కార్పొరేట్ వైద్యం తలపించేలా వుందని స్థానిక పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు రబీ, ఖరీఫ్ సీజన్ల లో అందించే విత్తనాల సైతం సమాచారం ఇవ్వరు. చిన్న పాటి రైతులకు వచ్చేసరికి విత్తనాల పంపిణీ పూర్తి అయిపోయాయని బోర్డు పెడతారు. ఇదేమి సమాదానం ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోవచ్చునని చెబుతారు. పంపిణీపై ప్రశ్నిస్తే తక్కువ స్టాకు వచ్చిందంటారు. ప్రభుత్వ అందించే సబ్సిడీ విత్తనాలు సమాచారం రైతులకు అందజేయలేదని రైతులు వాపోతున్నారు. వాల్మీకిపురం ఏడి కార్యాలయం మండలంలోని అన్ని పశు వైద్య శాలలకు ప్రదాన కార్యాలయం. ఇక్కడే ఈ పరిస్థితి వుంటే మిగిలిన చిన్నపాటి వైద్యశాల పరిస్థితి ఏలా వుంటుందో రైతులకే ఎరుక. స్థానిక ఆసుపత్రికి గొల్లపల్లి, ప్యారంపల్లి, నాగంవారిపల్లి, దండువారిపల్లి, పునుగుపల్లి, ఓబులంపల్లి, పత్తేపురం, నల్లం వాండ్లపల్లి, వాల్మీకిపురం పట్టణం అంతా స్థానిక కార్యాలయం పరిదిలోని వస్తాయి. చిన్న పాటి పాడి రైతులు వైద్యంకు వస్తే జేబులకు చిల్లు పడాల్సిందే. అంటూ స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పేరు గొప్ప.. వీధి దిబ్బ..

సమస్యల కుహరం బిస్మిల్లా నగర్
పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**




కడప కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్‌కు సంబంధించిన బిస్మిల్లానగర్ కొత్తగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఒకటి. అయితే లోతట్టు ప్రాంతంలో సమస్యలు అనేకం ఉన్నాయి. గత మూడు పర్యాయాలుగా ఒకే వ్యక్తి ప్రజా ప్రతినిధిగా ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. బిస్మిల్లా నగర్ నగరపాలక సంస్థ ఉర్దూ స్కూలు సమీపంలోని ఎప్పుడో తాతల కాలం నాటి మురుగు కాలువలు వర్షాలు పడినా పడక పోయినా పొంగి రోడ్డుపై పొర్లుతుంటాయి. ఒకటే దుర్వాసన, ఇక్కడే స్కూలు ఉండడంతో పిల్లలు, స్థానికులు తరుచు రోగాల భారిన పడుతున్నారని ప్రజలు భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ తూతూ మంత్రంగా మెయిన్ సెంటర్‌లో పర్యటిస్తే ఏమి లాభం లోతట్టుకు వస్తే సమస్యలు తెలుస్తాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల కుహరం బిస్మిల్లా నగర్‌లో ప్రవేశంలో రంగు రంగుల భవనాలు తప్ప సమస్యలు కనపడవు. లోతట్టు 8/581-1 ఇంటి నెంబరు గల ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డు నిర్మించని మురుగు కాలువలు పొంగి రోడ్డుపై పొర్లుతు దుర్వాసన వెదజల్లుతూ స్వాగతిస్తుంటాయి. పేరు గొప్ప.. వీధి (ఊరు) దిబ్బ అనే చందంగా బిస్మిల్లా నగర్‌కు చక్కగా సరిపోతుందంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా నగర మేయర్, కమిషనర్ ఈ ప్రాంతంలో పర్యటించి సమస్య లను చూసి పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కార్పొరేటర్ చాక్లెట్ గౌస్‌బాషాకు సన్మానం

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



స్థానిక గుంతబజార్, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వైసీపీ సీనియర్ నాయకులు సుభాన్ బాషా, సుల్తాన్ బాబాలు గత 22 ఏళ్లుగా మిలాద్ ఉన్ నబి నాతియా కలాం భక్తి గీతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పాల్గొని 33వ డివిజన్‌కు ఉత్తమ సేవలు అందిస్తున్న చార్లెట్ గౌస్ బాషాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌస్ బాషా మాట్లాడుతూ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, సుభాన్ బాషా, సుల్తాన్ బాబాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా ఆరీఫ్‌ఖాన్ (మున్నా), ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్లకు సన్మానం

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



స్థానిక మట్టి పెద్దపులి వీధిలో సోమ వారం వేకువజామున జరిగిన బార్మీ అన్నదాన కార్యక్రమంలో దాతలైన 33, 34 డివిజన్ల కార్పొరేటర్లు గౌస్‌బాషా, అలీ అక్బర్‌లను కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సైపుద్దీన్, జిలాన్, ఎజాస్, సాబ్‌జాన్, జమీర్, జిలాన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## బార్మీ కార్యక్రమం పుణ్యఫలం

– మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ బుచ్చుర్ ఆరీఫుల్లా

**కడప కార్పొరేషన్, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



బారాపత్ మాసంలో బార్మీ కార్యక్రమం నిర్వహించడం పుణ్య ఫలమని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ బుచ్చుర్ ఆరీఫుల్లా పేర్కొన్నారు. ఆదివారం 28వ డివిజన్ సామాజిక కార్యకర్త షామీర్ ఆధ్వర్యంలో బార్మీ కార్యక్రమంలో ఆరీఫుల్లా పాల్గొని వడ్డించారు. అనంతరం బార్మీ కార్యక్రమం నిర్వహించిన షామీర్‌ను అభినందించారు.

## మండల తెలుగు యువత కార్యదర్శిగా ఖాసీంపీరా

**రామాపురం.అక్టోబర్ 16 ప్రభాతవార్త**



మండల తెలుగు యువత కార్యదర్శింగా షేక్ ఖాసీంపీరా ను ఎంపిక చేస్తూ రాష్ట్ర జాతీయ అద్యక్షుడు చంద్రబాబు నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల తెలుగు యువత కార్యదర్శిగా ఇచ్చినందుకు తెలుగుయువత రాష్ట్ర అద్యక్షుడు శ్రీరాం, చిన్నబాబు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, రాయచోటి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఆయనకు అప్పగించిన బాద్యతలును సక్రమంగా నిర్వహిస్తూ మండల పరిధిలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్‌పై కొరడా

(మొదటి పేజీ తరువాయి)

భూమిని రిజిస్ట్రేషన్ చేసే సమయంలో కనీస అధికారిక పత్రాలను చూడకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేశారు? అన్న కోణాల్లో విచారణ జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ తాళ్లపాక ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్, అవినీతి భాగోతంపై సమగ్ర నివేదిక పరిశీలించిన తర్వాత మొత్తం బోగస్ అని నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఈ వ్యవహారంపై ప్రభుత్వ భూములు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు? ఎవరు చేసుకొన్నారు అనే అంశంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాజంపేట తహశిల్దారుకు పోలీసు కేసు నమోదు అయ్యేలా ఫిర్యాదు చేయాలని ఆదేశించి నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ వ్యవహారానికి సంబంధించి రాజంపేట తహశిల్దారు ముద్దా సుబ్రమణ్యంరెడ్డిని 'వార్త' వివరణ కోరగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిన విషయం వాస్తవమేనని వివరించారు. ఏది ఏమైనా రాజంపేటలో ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించడం, అమ్ముకోవడం పరిపాటిగా మారింది. అసలు తాళ్లపాక భూకుంభకోణంలో సూత్రదారులు ఎవరు? పాత్రదారులు ఎవరు? తెరవెనుక ఎవరు ముందుండి నడిపించారు? అసలు ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నవారు అసలు సూత్రదారులా? కాదా? రాజంపేటలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఉండగా రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఏముంది? రేణిగుంటలో ప్రధాన డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత మిగతా డాక్యుమెంట్‌లు అక్కడే రిజిస్ట్రేషన్ జరిగి ఉంటే అనుమానాలకు అవకాశం లేదు. అలా కాకుండా అసలు డాక్యుమెంట్ రేణిగుంటలో రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత మిగతా 24 డాక్యుమెంట్‌లు రాజంపేటలో జరగడమే కీలకం. ఈ భూభాగోతం వెనుక అసలు సూత్రదారులు ఎవరో తేలనుంది. ఈనెల 9న చిత్తూరులో నకిలీ డాక్యుమెంట్లతో అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిన అవినీతి వ్యవహారంపై అక్కడి కలెక్టర్ ఉక్కుపాదం మోపారు. అక్రమ రిజి స్ట్రేషన్ వ వ్యవహారంలో ఓ సబ్‌రిజిస్ట్రార్, తహశిల్దారు, ముగ్గురు విఆర్ఒలపై కేసులు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారం సంచలనం సృష్టించింది. ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్‌లు, ప్రభుత్వ భూముల అమ్మకాలపై ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. చిత్తూరు సంఘటనలాగే అన్నమయ్య జిల్లా తాళ్లపాకలో ప్రభుత్వ భూములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడంపై కూడ కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ మేరకే అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

## డీఎంహెచ్‌వో డా.జమాల్ బాషాకు సన్మానం

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



సీనియర్ కెమెరామెన్ రాయల్ రషీద్ కార్యాలయంలో ప్రముఖ సీనియర్ వైద్యులు, కడప నగరానికి చెందిన డా.సి.జమాల్ బాషా డీఎంహెచ్‌వోగా పదోన్నతి పొంది కడపకు వచ్చిన సందర్భంగా మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎం.ఎం.హాస్పిటల్ చైర్మన్ డా.షేక్ మహబూబ్ పీర్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ప్రముఖ యువ వైద్యురాలు డా.నూరి ప్యారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 35 సంవత్సరాలుగా వైద్య రంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్న డా.జమాల్ బాషా ప్రశంసనీయులన్నారు. డా.జమాల్ బాషా నంది మండలంలో మెడికల్ ఆఫీసర్‌గా, కడప బ్లడ్‌బ్యాంక్ ఆఫీసర్‌గా, హైదరాబాదు నిమ్స్‌లో పరిపాలన వైద్యాధికారిగా, నెల్లూరు జిల్లా వెంకట గిరిలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా, కడపలో జిల్లా ఆరోగ్య శిక్షణ ప్రాజెక్టు అధికారిగా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంవోగా, వైఎస్ఆర్ జిల్లాలో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా, అన్నమయ్య జిల్లాలో టీకాల అధికారిగా, ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో డీఎంహెచ్‌వోగా పదోన్నతితో సేవలందించడానికి వెళ్తున్న సందర్భంగా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు. ప్రత్యేకంగా పవిత్రమైన హజ్ యాత్రలో హజ్ యాత్రికులకు ప్రభుత్వం తరుపున 7 సార్లు వెళ్లి సేవలందించడం హర్షణీయమన్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేదల డాక్టర్‌గా జమాల్ బాషా ఉచిత వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ గైరవ అధ్యక్షుడు షేక్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రాయల్ రషీద్, సభ్యులు పాల్గొన్నారు.

## భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా రక్తదాన శిబిరం

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**

రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా కడప నగరంలో 31వ డివిజన్ కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ రహ్మతుల్లా ఖాన్ రక్తదాన శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతంరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాంగ్రెస్ శ్రేణులు 15 మంది రక్తదానం చేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్ర ఏపీలో అడుగిడిన సందర్భంగా యాత్ర విజయవంతం కోసం కడపలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 2024లో రాహుల్ గాంధీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు సామాన్యునికి అందుబాటులోకి వస్తాయన్నారు. వంట నూనెలు, నిత్యావసరాల ధరలు, రైతులకు, గిట్టుబాటు ధరలు కల్పించబడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కులాలు మతాల పేరుతో ప్రజలను విడగొడుతుంటే రాహుల్ గాంధీ భారత్ జోడో పేరిట ప్రజలందరినీ ఏకం చేస్తున్నారన్నారు. కడప జిల్లా నుంచి యాత్రకు వేలాదిగా తరలి వెళ్తున్నట్లు నేతలు చెప్పారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు తీసిపోని విధంగా ఏపీలో యాత్ర ప్రారంభమైందన్నారు. 18, 19, 20, 21 తేదీల్లో యాత్ర కర్నూలు జిల్లాలోని ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు మంత్రాలయం ప్రాంతాల్లో జరుగుతుందన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో రహ్మతుల్లాఖాన్‌తో పాటుగా జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సత్తార్, వెంకటరమణారెడ్డి, అలీఖాన్, చార్లెస్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధ్రువకుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, సుబ్బారెడ్డి, బాబు, జిల్లా నేతలు ప్రసాద్, ఓబులేసు, పసుపులేటి, మురళీ, మహిళా అధ్యక్షురాలు శ్యామలాదేవి, గౌరీ, రసూల్ పాల్గొన్నారు.

## ఎత్తపుకాలనీలో బాదుడే బాదుడు

**జమ్మలమడుగు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధి లోని 12వ వార్డు (ఎత్తపుకాలనీ)లో ఆది వారం బాదుడే బాదుడు కార్యక్రమాన్ని జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు కాలనీ వాసులు గజ మాలలు వేసి టపాసులు పేల్చుతూ డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. కార్యకర్తల సమోంలో ముందుగా పుట్టిన రోజు వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం యువకులు, మహిళలతో వార్డులో సంచి రంచి ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజలపై మోపిన భారాలు, పన్నులు, పెంచిన ధరలను వివరిస్తూ ముందుకు సాగారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించి ప్రజలపై మోపిన పెను భారాలు తగ్గించాలన్నారు. 2023లో జరిగే పశ్చిమ రాయలసీమ పట్ట భద్రుల శాసన మండలి ఎన్నికలో తెదేపా అభ్యర్థి అయిన భూమిరెడ్డి రామ గోపాల్‌రెడ్డిని గెలిపించి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే కార్యక్రమంలో మొదటి అడుగు కావాలని ప్రజలకు విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి కొండయ్య, జమ్మలమడుగు మండ ల తెదేపా అధ్యక్షుడు యూత్ నాగేశ్వర్‌రెడ్డి, కిరణ్ రాయల్, నవనీశ్వర్‌రెడ్డి, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జయచంద్ర, సునీల్‌శెట్టి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖదీర్, మద్దిలేటి, సురేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్లను రద్దు చేయాలి : పిడిఎస్‌యూ

**లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్లను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు గంగన్న పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డి పల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకున్నారని తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేస్తోందన్నారు. ఇప్పటికే పంటలు సరిగా పండడం లేదని, గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్న సందర్భంలో మళ్లీ అకాల వర్షాలతో ఉన్న పంటలు కోల్పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు మీటర్లు పెట్టడం చాలా అన్యాయమన్నారు. ఏ రాష్ట్రంలో లేని జీవోలు ఏపీలో అమలు చేయాలనుకోవడం విడ్డూరంగా ఉంద న్నా రు. ఇప్పటికైనా ఇలాంటి ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు. కార్య క్రమంలో ప్రగతిశీల యువజన సంఘం నాయకులు చంద్రశేఖర్, అన్న మయ్య జిల్లా పీడీఎస్‌యూ జిల్లా నాయకులు స్వరూప్ తేజ, అశోక్, అఖిల భారత రైతు సంఘం లక్కిరెడ్డిపల్లె మండల నాయకులు బాలయ్య పాల్గొన్నారు.

## దళితుల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



లక్కిరెడ్డిపల్లె మండలం పాలెం గొల్లపల్లె హరిజనవాడలోని పిల్ల గువ్వల వెంకట రమణ భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేశారని దళితుడి భూమి అతనికి ఇప్పించాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాల క్రితం దళితులకు భూమి పట్టా మంజూరు చేశారని కానీ కొంత మంది కబబ్జాదారులు ఆ భూమిని చదును చేసి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని రెవెన్యూ యంత్రాంగానికి తెలిపినప్పటికీ దళితుల సమస్యలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి దళితుల భూములు కబ్జాదారుల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు పిల్ల గువ్వల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌సీపీ నాయకుడిని పరామర్శించిన శ్రీకాంత్‌రెడ్డి

**లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 16, ప్రభాతవార్త:**

అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఇంటి వద్ద విశ్రాంతి తీసు కుంటున్న వైఎస్ఆర్‌సీపీ నాయకుడు వేణు గోపాల్‌ను ఆదివారం అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అన్న మయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, ఉప మండలాధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఉప సర్పంచ్ వేమి రెడ్డి, రాజారెడ్డి, సర్పంచులు జనార్ధన్‌రెడ్డి, రామచంద్ర, ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, శంకర్ నాయుడు, జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, అలీ బాషా, గోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి, శివ మల్లప్ప నాయుడు పాల్గొన్నారు.

## కోడూరు ప్రశాంతతను కాపాడండి

**ఓబులవారిపల్లె, అక్టోబరు 16, ప్రభాతవార్త:**

గత 15 సంవత్సరాలుగా ఎటువంటి గొడవలు, హత్యలు జరిగిన దాఖలాలు లేవు. కోడూరు మరో కోనసీమగా పిలవబడే పట్టణంలో పండ్ల తోటలు అధికంగా పండించడం, పచ్చని పైర్లతో రైతులు ప్రతి దినం వ్యవసాయాలు, వ్యాపారాలు చేసుకుంటూ అన్నదమ్ముల వలె సౌభ్రాతృత్వంతో లౌకికంగా అందరూ కలిసి మెలసి జీవించే రైల్వే కోడూరు పట్టణంలో ఒక్క సారిగా పట్టణం ఉలిక్కిపడింది. రైల్వేకోడూరు మండలంలోని మైసూరువారిపల్లి పంచాయతీలో ఉన్న శాంతినగర్‌కు చెందిన మాజీ సర్పంచ్ దివిటి మోహన్ హత్య ఒక్క సారిగా ప్రజలను వైసీపీ నాయకులను కలవరపెట్టింది. పట్టపగలే మోహన్ ఇంట్లో వరండాలో భార్యతో మాట్లాడుతుండగా ఒక్క సారిగా ఇద్దరు యువకులు వచ్చి కత్తితో దాడి చేసి పారిపోయారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ హత్య వెనక ఎవరున్నారు, హత్య చేసిందెవరు అనే వివరాలు సేకరించి పోలీసున్నతాధికారులు గట్టి చర్యలు తీసుకొని మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చేయాలని ఆయన భార్య అంగన్‌వాడీ టీచర్ ధనమ్మ మరియు కుటుంబ సభ్యులు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా ఇలాంటి హత్యలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని పలువురు అంటున్నారు. రైల్వేకోడూరులో ఇటీవల ఎన్నో దారుణాలు జరుగుతునే ఉన్నాయి. భూ మాఫియా, రియల్ ఎస్టేట్, గంజాయి మాఫియా, పేకాట, వడ్డీల వ్యాపారాలు చేసే వారు పెట్రోగిపోతున్నారు. అంతే కాకుండా యువత మద్యం, గంజాయికి బానిసై ఇటీవల కొద్ది రోజుల క్రితం ఓ మహిళను హత్య చేసి రైల్వే ట్రాక్‌పై వేయడం, డ్రగ్స్, ఎర్రచందనం తదితర వ్యాపారాలు, వర్గ పోరాటాలు కూడా ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు. మృతుడు మోహన్ పంచాయతీలో పెద్ద మనిషిగా చెలామని అవుతూ కొన్ని పంచాయతీలు చేస్తూ ఉండేవారని పలువురు నాయకులు ఆయన చేసిన మంచి పనులు చెప్పుకొచ్చారు. రైల్వే కోడూరులో పోలీసులు డేగ కన్ను వేసి చట్ట వ్యతిరేక కార్యక్రమాలపైన హత్యా రాజకీయాలపై ఉక్కు పాదం మోపి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కోడూరులో ప్రశాంత వాతావరణం తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## అట్టడుగు వర్గాలకు తెలుగుదేశంలో హయాంలోనే న్యాయం

టిడిపి గ్రామీణ అధ్యక్షుడు సుబ్బనరసయ్య

**రాజంపేట అర్బన్, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



తెలుగుదేశంపార్టీలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి న్యాయం జరుగుతుందని పార్టీ రాజంపేట మండల గ్రామీణ అధ్య క్షుడు సుబ్బనరసయ్య పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కడప గడపకు కార్య క్రమంలో భాగంగా చవనవారిపల్లె, మిట్ట మీదపల్లె గ్రామాల్లో పాల్గొన్నారు. రాజంపేట జడ్‌పిటిసి ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామంలో అరుంధతివాడకు చెందిన పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరినట్లు సుబ్బనరసయ్య పేర్కొన్నారు. దళితుల సంక్షేమానికి తెలుగుదేశం హయాంలో ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజల పక్షపాతి చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో పంచాయతి సర ్పంచ్ మంచాల కోటయ్య, మాజీ ఎంపిటిసి దుగ్గినేని చంద్ర, చంద్రబాబునాయుడు, చవన పాపయ్య నాయుడు, కేసినేని శ్రీనివాసులు నాయుడు, సురేష్‌నాయుడు, దాసరి దేవి, లక్ష్మమ్మ, దాసరి యానాది, పద్మ, శ్రీరాములు పాల్గొన్నారు.

## దీన్‌దయాల్ స్పర్శ యోజన పరీక్ష

**జమ్మలమడుగు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు సబ్ డివిజన్ పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఉద్యోగాలు జమీర్ హుసేన్ ఆధ్వర్యంలో ఆదివారం జమ్మల మడుగులో సాయి పరమేశ్వర డిగ్రీ కాలేజీ లో 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు దీన్‌దయాల్ స్పర్శ యోజన పథకం పరీక్ష పెట్టడం జరిగింది. 170 మంది విద్యార్థులు పరీక్ష రాయడం జరిగింది. రాసిన వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రూ.6వేలు స్కాలర్షిప్ ఇవ్వడం జరుగుతుందని జమ్మలమడుగు ఇన్‌స్పెక్టర్ జమీర్ హుసేన్ తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు బిస్కెట్లు, కూల్ డ్రింక్స్ ను కూడా సరఫరా చేశారు. కార్య క్రమంలో పులివెందుల ఇన్‌స్పెక్టర్ శివ కిశోర్‌రెడ్డిచీఫ్నీజి పోస్టు మాస్టర్లు రమణా రెడ్డి, నాగ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, 1రవికుమార్, క్రాంతి, గంగాధర్, మెయిల్ ఓవర్ స్ జయకర్, మురళీ కృష్ణమూర్తి, జమ్మలమడుగు సబ్ డివిజనల్ పోస్టల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**పాసుపోర్టు పోయినది**

తుపాకుల సుజాత, భర్త టి.ఆనంద్‌రెడ్డి, డి.నెం. 26/835-2, మిట్టమడివీధి, ప్రొద్దుటూరు టౌన్, ప్రొద్దుటూరు, వైఎస్ఆర్ కడప జిల్లా, ఎపి, రామేశ్వరం నుండి ఆటోలో వెళ్తుండగా పాసుపోర్టు నెం.V2749505 పాసుపోర్టు పోయినది. దొరికినచో ఈ క్రింది నెంబర్‌కు తెలుపుగలరు. 6301695255.

## 20న ఉచిత వైద్య శిబిరం

**ప్రొద్దుటూరు అర్బన్ అక్టోబర్ 16, ప్రభాతవార్త**



ప్రతి నెల మూడవ ఆదివారం నాడు ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్న లక్ష్య కార్డియాక్, కంటి ఆసుపత్రి నందు పేద ప్రజల కోసం ఉచిత కంటి గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహిస్తామని డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ హరిత తెలిపారు. ఆదివారం నాడు ఇరవై వ (20వ) ఉచిత వైద్య శిబిరం నిర్వహించరు. ఇందులో భాగంగా డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి 48 మంది రోగులను ఉచితంగా పరీక్షించి, వీరిలో 23 మందికి ఉచితంగా ఇసిజి మరియు 7 మందికి ఉచితంగా గుండె స్కానింగ్ చేసి రోగులకు తగు చికిత్స, సూచనలు ఇచ్చారు. డా హరిత 33 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, వారికి తగు చికిత్స, సూచనలను అందించారు.

## కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి : ఒంటేరు

**ప్రొద్దుటూరు అర్బన్ అక్టోబర్ 16, ప్రభాతవార్త**

రాష్ట్రంలో అమలవుతున్న కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థను రద్దుచేసి కాంట్రాక్టు అధ్యాపక, ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిం చాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేక అభద్రతా భావంతో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ప్రక్కన ఉన్న ఒడిశా రాష్ట్రంలో 57వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను అక్కడి ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని, నిర్ణయం తీసుకొన్న ఒడిశా ప్రభుత్వానికి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి ఒప్పంద అధ్యాపక సంఘం నాయకులు గోవర్ధన్ , నాగేంద్రలు అభినందనలు తెలిపారు. మన పొరుగునే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కూడా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసే ప్రక్రియ పూర్తి కావస్తోందన్నారు. కావున మన రాష్ట్ర ప్రభుత్వం కూడా కాంట్రాక్టు అధ్యాపకుల,ఉద్యోగుల సమస్యను పరిగణలోనికి తీసుకుని వారిని రెగ్యులర్ చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. భవిష్యత్తులో జరిపే నియామకాలన్నీ రెగ్యులర్ ప్రాతిపదికన జరపాలని, తద్వారా ఉద్యోగులు సంతృప్తికరమైన నిబద్ధతతో కూడిన విధులును నిర్వర్తించి ప్రభుత్వానికి మేలు చేకూరేందకు దోహదపడుతుందని ఆయన తెలియచేసారు.

## పొన్నతోట వెంకటరెడ్డి ఉద్యమ స్ఫూర్తి ఆదర్శనీయం

**కడప వైవీయూ అక్టోబర్ 16, ప్రభాతవార్త**



కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ శిల్పి కామ్రేడ్ పొన్నతోట వెంకటరెడ్డి పుస్తకం లో తెలుసుకోదగిన చారిత్రకమైన విలువైన అంశాలు ఎన్నో ఉన్నాయని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్యకళావతి అన్నారు. ఉపకులపతి ఆచార్య సూర్యకళావతి, కులసచివులు ఆచార్య డి.విజయ రాఘవ ప్రసాద్, వైవీయూ. అధ్యాపకులకు బహూకరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ కామ్రేడ్ పొన్నతోట వెంకటరెడ్డి కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణకర్తలో కీలకమైన వ్యక్తిగా కడప జిల్లాలో ఎంతో కృషి చేశారని తెలిపారు. కమ్యూనిటీ సిద్ధాంతాల అంకితమై విలువలతో, నిబద్ధతతో జీవించారని తెలిపారు. దాదాపు వందేళ్ల కిందటే విద్యార్థి సంఘాలను స్థాపించి నిర్వహించిన మార్గదర్శి పొన్నతోట అని కులసచివులు ఆచార్య విజయ రాఘవ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత గంగాధర్‌రెడ్డి అభినందించారు. 1942లో యువతకు ఉచితంగా హిందీ బోధన, రాజకీయ శిక్షణ తరగతులు ఇచ్చేవారంటే ఆనాటి ప్రజలను చైతన్యం చేసే మూర్తిమత్వం ఆయనలో కనిపిస్తుందని సీడీసీ డీన్ డా. వై.సుబ్బరాయుడు, పరీక్షల నియంత్రణాధికారి, తెలుగు శాఖ సహాయ ఆచార్యులు తెలిపారు. పుస్తకరచనలో, ఆధారాల సేకరణ, చారిత్రక అంశాలు గురించి పుస్తక రచయిత గంగాధర్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఆంగ్రశాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ జయంత్ కశ్యప్ పాల్గొన్నారు.

## ఆర్కిటెక్చర్ రెండో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**కడప వైవీయూ అక్టోబర్ 16, ప్రభాతవార్త**

వివిధ విద్యాసంస్థల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) లో రెండో విడత ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ విషయాన్ని ఏపీ బీ.ఆర్క్ ప్రవేశాల కన్వీనర్, డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈసీ సురేంద్ర నాథ్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్ లేదా డిప్లొమా (10౦3) పూర్తి చేసి నాటా (నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్), జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తొలి విడతలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని విద్యార్థుల కోసం ఈ నెల 17నుండి19 వరకు(తాజాఅభ్యర్థుల) ఓసి అభ్యర్థులు -1500, బిసి అభ్యర్థులు-1300, ఎస్సి,ఎస్‌టి అభ్యర్థులు-1000 ఆన్ లైన్ రిజిస్ట్రేషన్,ఆన్ లైన్ చెల్లింపు తో పాటు ధ్రువీకరణ పత్రాలు స్కాన్ చేసి అప్లోడ్ ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొలి విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కూడా ఫీజ్ చెల్లించకుండానే దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలియచేశారు. విజయవాడ లో ఆయన మాట్లాడుతూ ర్యాంకులు పొందిన అభ్యర్థులు 21,22 తేదీలలో వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని సూచించారు.25 న కళాశాలల వారీగా సీట్లు పొందిన అభ్యర్థుల రెండో విడత ప్రవేశాల జాబితాను వెబ్ సైట్ లో ఉంచుతామని తెలిపారు.ప్రవేశాలు పొందిన కళాశాలల్లో విద్యార్థులు 26 న ఉదయం10గంటల నుండి 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు రిపోర్ట్ చేయడం తో పాటు నిర్దేశించిన ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.29 న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తామని కన్వీనర్ సురేంద్ర నాథ్ రెడ్డి వివరించారు.తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి అయిన తరువాత రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ కు మిగిలిన సీట్లు వివరాలు విశాఖపట్నంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఏయూ) లో 15 సీట్లు, గుంటూరు లోని ఆచార్యా నాగార్జున యూనివర్సిటీకాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ (ఏఎన్ యూ) లో 21సీట్లు, కడప లోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (వైఎస్సార్ ఏఎఫ్ యూ) లో 20 సీట్లు,విశాఖపట్నంలోని వరాహ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ లో 28 సీట్లు, భీమవరంలోని ఎం.ఆర్.కె కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో 15 సీట్లు అందబాటులో ఉన్నాయని తెలిపారు.

## గృహాలను ఖాళీ చేయాలనడం తగదు

**ప్రొద్దుటూరు అర్బన్ అక్టోబర్ 16, ప్రభాతవార్త**



కోర్టు పరిధిలో లేని వాజపేయి నగర్ వాసుల గృహాలను ఖాళీ చేయాలనడం తగదని ఏపి ఎమ్మార్పీఎస్ ప్రొద్దుటూరు మహిళా అధ్యక్షురాలు చెన్నమ్మ, ప్రొద్దుటూరు ఇన్చార్జ్ వెంకటనారాయణ, వాజపేయి నగర్ వాసులు కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వాజపేయినగర్ విషయములో కోర్టు తీర్పును తాము గౌరవిస్తామని, కానీ కోర్టు పరిధిలో లేని వాజపేయి నగర్ వాసుల గృహాలను ఖాళీ చేయాలనడం తగదన్నారు. తామంతా పేదలమని, తమకు ప్రత్యామ్నాయ నివాస స్థలాలు చూపి, తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో వాజపేయి నగర్ వాసులు రామాంజనమ్మ, కృపా తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సయిజ్ కేసులో ఇద్దరు వ్యక్తులు అరెస్టు

16-10-2022 వ తేదీ ఉదయం 8:00 గంటలకు మైదుకూరు టౌన్ ప్రొద్దుటూరు రోడ్ లోని జాతీయ రహదారి దగ్గర్లో %1%.రామ రెడ్డి,%జ%.వెంకట సుబ్బారెడ్డి లను అక్రమంగా 36 బాటిల్ ల నిషేధిత మద్యమును విక్రయిస్తున్నందుకుగాను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచడం జరిగింది.

## రాత్రి సమయాలలో లోడింగ్ అన్‌లోడింగ్ చేసుకోవాలి

**రాయచోటి టౌన్.అక్టోబర్ 16 ప్రభాతవార్త**

రాయచోటి పట్టణంలో దుకాణాదారులు లోడింగ్ అన్‌లోడింగ్ రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు చేసుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఒక రోజు దుకాణాదారుల వినతి మేరకు ఆదివారం ఒక్క రోజు మాత్రం రోజు మొత్తం అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మిగతా రోజులలో రాత్రి 8 గంటల తర్వాత మాత్రమే లోడింగ్ అన్‌లోడింగ్ చేసుకోవాలని అన్నారు. దుకాణాదారులు ఈ అవకాశాన్ని ప్రజా రవాణాకు భంగం కలగకుండా ఉపయోగించుకోవాలన్నారు.

# పంట నమోదు చేసిన పొలాలను పరిశీలించిన అధికారులు

**జమ్మలమడుగు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



ముద్దనూరు మండలం మంగపట్నం, శెట్టివారిపల్లి గ్రామాల్లో ఖరీఫ్ 2022 సీజన్‌లో పంట నమోదు చేసిన పొలాలను రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ వారి కార్యాలయం నుంచి ఏడీఏ ఎరువుల విభాగం నుంచి వచ్చిన కె.జయదేవరాజన్ గ్రామాల్లో పంట నమోదు చేసిన పొలాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కె.జయదేవ్‌రాజన్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ముద్దనూరు మండలంలోని శెట్టివారిపల్లె మరియు మంగసపట్నం గ్రామాల్లో పంట నమోదు చేసిన 57 సర్వే నెంబర్లలో 37 మంది రైతుల ఒలాల్లో సాగు చేసిన పంటలు సక్రమంగా ఉన్నాయో లేదో అలాగే విస్తీర్ణం సరిపడా ఉందా లేదా అని పంట నమోదు చేసిన పొలాల్లో ప్రస్తుతం పంట ఉందా లేదా అనే విషయాలను క్షుణ్ణంగా ప్రతి సర్వే నెంబరును పరిశీలించి రైతులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పర్యవేక్షణకు వచ్చిన ఏడీఏతో కలిసి క్షేత్రస్థాయిలో పంట నమోదు చేసిన రైతుల పొలాలను సందర్శించి తనిఖీ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి రైతు సాగు చేసిన పంటలను సర్వే నెంబరును పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ, రెవెన్యూ అధికారి శివప్రసాద్, గ్రామ ఉద్యాన సహాయకురాలు ఎం.రాధా, గ్రామ సర్వేయరు గొర్ల జ్యోతి, గ్రామనాయకులు బాబుల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, గ్రామ రైతులు, గ్రామ నౌకర్లు పాల్గొన్నారు.

# సిరి నిరాశ్రయులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

**జమ్మలమడుగు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్ట వీధిలో ఉన్న సిరీ నిరాశ్రయుల అనాథ వృద్ధాశ్రమంలో ముద్దనూరు మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తన కుమారుడు మారెడ్డి వెంకట నిమాల్‌రెడ్డి జన్మదిన సందర్భంగా వేడుకలను వృద్ధుల సమక్షంలో నిరాడంబరంగా నిర్వహించి వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తన పిల్లల పుట్టిన రోజు వేడుకలను నిర్వహించి పిల్లలకు చిన్న నాటి నుంచి సమాజం పట్ల మానవతా దృక్పథంతో సేవ చేయాలనే ఆలోచనలను వారికి కల్పిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు తమ కుమారునికి చల్లని దీవెనలు అందించి ఎంతో మందికి తన నిజ జీవితంలో సేవ చేయాలని సమాజానికి ఉపయోగపడాలని తన చల్లని దీవెనలు వుంటాయని వృద్ధులు దీవించారు. ఈ కార్యక్రమంలో మధుచరణ్ తేజారెడ్డి, మధు, హాసిని, వృద్ధాశ్రమ కేర్ టేకర్ ప్రకాశమ్మ పాల్గొన్నారు.

# నేటి నుంచి గడప గడపకు కార్యక్రమం

**గాలివీడు.అక్టోబర్ 16 ప్రభాతవార్త**

సోమవారం నుంచి గాలివీడు మండలంలో జరగబోవు గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొననున్నట్లు ఎంపిడివో శేఖర్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 17,18,19,20వ తేదీలలో నాలుగు రోజులు పాటు గాలివీడు 2, 3 సచివాలయ పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

# అనాధాశ్రమంలో పిల్లలకు పండ్లు పంపిణీ

**బద్వేలు రూరల్, అక్టోబరు 16 ప్రభాతవార్త :**



స్థానిక షాలోమ్ అనాధాశ్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంఘం ఆధ్వర్యంలో అనాధ పిల్లలకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల పట్టణ అధ్యక్షులు రఫి, 13వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ హసాన్ మాట్లాడుతూ భారతదేశ 11వ రాష్ట్రపతి అయిన డా॥ ఏ.పి.జె.అబ్దుల్ కలాం జీవితాన్ని పిల్లలకు వివరిస్తూ తమిళనాడులోని రామేశ్వ రంలో జైనుల్లాబ్దీన్, ఆషియమ్మ దంపతులకు జన్మించారన్నారు. అబ్దుల్ కలాం పూర్తి పేరు ఆవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం అని పేర్కొన్నారు. పేద కుటుంబం కావడంతో కుటుంబ అవసరాల కోసం చిన్న వయసు నుండే పనిచేయ డం ప్రారంభించడంతో పాటు, పాఠశాల విద్య పూర్తి చేసిన తరువాత తన తండ్రి కి ఆర్థికంగా చేదోడు వాదోడుగా ఉండేవారని, పాఠశాలలో సగటు మార్కులు వచ్చినప్పటికీ నేర్చుకోవడానికి తపనపడే వారని, ఎక్కువ సమయం చదువు మీదే ధ్యాస ఉంచేవారని, రామనాధపూర్ స్క్వార్జ్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో పాఠశాల విద్య పూర్తి చేశాక కలాం తిరుచిరాపల్లి లోని సెయింట్ జోసెఫ్స్ కళాశాలలో చేరి 1954 లో భౌతిక శాస్త్రంలో మద్రాసు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ లో పట్టు సాధించారని, 1980 జులైలో ఈ వాహనం రోహిణి ఉపగ్రహాన్ని భూమి దగ్గరి కక్షలోకి విజయవంతంగా చేర్చిందని, 1970-90 మధ్య కాలంలో కలాం పిఎస్ఎల్‌వి, ఎస్ఎల్‌వి ప్రాజెక్టుల అభివృద్ధికి పని చేశారన్నారు. 2002 నుండి 2007 వరకు భారతదేశ 11వ రాష్ట్రపతిగా తన సేవలను అందించారని, భారత రత్న పొందిన రాష్ట్రపతులలో అబ్దుల్ కలాం మూడవ వారని, ఆయన కృషికి భారత ప్రభుత్వం 1981 లో పద్మ భూషణ్, పద్మ విభూషణ్ అవార్డులతో సత్కరించడం జరిగిందని, 2015 జూలై 27న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, షిల్లాంగ్‌లో ఉపన్యాసం ఇస్తున్నపు డు కలాంజీ (83) తీవ్ర గుండెపోటుతో తుదిశ్వాస విడిచారన్నారు.కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఖాదర్ హుస్సేన్, విభిన్న ప్రతిభావంతుల సంఘం సభ్యులు మౌలాలి, గగ్గుటూరు ఖాదర్ బాష, దూదేకుల మహమ్మద్ హుస్సేన్, ప్రసన్న కుమార్, కదిరుల్లా, రాజన్న, బండిపోతు రాజు, చింతకుంట ఖాజా, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

# ఉన్నత స్థాయికి ఎదిగిన శిష్యుల కలయిక పూర్వజన్మ ఫలమే

**– రిటైర్డ్ హెడ్మాస్టర్ సిద్దారెడ్డి**

**తంబళ్లపల్లె, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



దాదాపు 5 దశాబ్దాలు కావస్తున్న తన వద్ద చదువుకున్న శిష్యుల కలయిక చూడడం నా పూర్వజన్మ పుణ్య ఫలమేనని రిటైర్డ్ హెడ్మాస్టర్ సిద్దారెడ్డి కొనియాడారు. ఆదివారం తంబళ్లపల్లె జడ్పీ హైస్కూల్లో 1986-87 సంవత్సరంలో చదువుకున్న పదో తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ సిద్దారెడ్డి, అరుణకుమారి, వెంకట రమణలకు విద్యార్థులు పాద పూజ చేసి ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో సైతం నాటి విద్యార్థులు గురువులను మరిచిపోకుండా దశాబ్దాలు దాటినా మా ప్రేమ అభిమానాలను పొందాలనుకోవడం ఓ వరంగా భావిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఉపాధ్యాయుల నాటి విద్యాభ్యాసం, చేసిన అల్లరి, నేడు ఉన్నత స్థితిపై సంతోషంగా చర్చించుకున్నారు. గురు శిష్యుల బంధానికి ఈ విద్యార్థుల అపూర్వ కలయిక ఓ తార్కాణంగా నిలిచిపోయింది. ఈ విద్యార్థుల అపూర్వ కలయిక సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈలు రెడ్డి కుమార్, చంద్రమౌళి, లైన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, జయరాంరెడ్డి, డిష్ భాస్కర్, కండక్టర్లు కృష్ణమూర్తి, సయ్యద్ బాషా, డీలర్ చంద్ర, సాంబశివారెడ్డి, కుమార్‌రెడ్డి, సుధాకర్, కృష్ణ నాయక్, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, అన్సారి, రెడ్డి భాస్కర్, ఉమాదేవి, అరుణ, రామప్ప, సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాత్ముని సూక్తితో ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి ముందుకు రావాలి

**పులివెందుల రూరల్, అక్టోబరు 15, ప్రభాతవార్త :**



మహాత్మాగాంధీ అహింసా సూక్తితో ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆ పార్టీ జిల్లా కోఆర్డినేటరు రహంతుల్లా, ట్రెజరర్ అబ్దుల్ రజాక్, ఆప్ సభ్యుడు షామీర్, పీర్ బాషా, సలీమ్‌లు కోరారు. ఆదివారం పులివెందులలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిస్డ్‌కాల్ పాంప్లెట్స్ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రహంతుల్లా మాట్లాడుతూ గాంధీజీ కోరుకున్న గ్రామ స్వరాజ్యం రావాలంటే అవినీతి, అక్రమాల పాలకులను, అటువంటి పార్టీలను ప్రజలు రాజకీయ ప్రక్షాళన చేయాలని తెలిపారు. అప్పుడే ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, తాగునీరు, అవినీతి రహిత ప్రభుత్వ సేవలు అందుతాయని తెలిపారు. ఇందుకు నిదర్శనం ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలో గత 8ఏళ్లుగా ప్రజలకు అందిస్తున్న సేవలు అమలు చేస్తున్న ప్రజా గవర్నెర్స్ సుపరిపాలన భారతదేశమే కాకుండా ఇతర దేశాలు సైతం కొనియాడుతున్న కేజ్రీవాల్ పాలన మన రాష్ట్రంలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటరు రహంతుల్లా, ట్రెజరర్ అబ్దుల్ రజాక్, పట్టణ సభ్యులు షామీర్, పీర్‌బాషా, సలీమ్‌లు పాల్గొన్నారు.

# బీజేపి మండల అధ్యక్షులుగా విజయభాస్కర్ రెడ్డి

**రామాపురం.అక్టోబర్ 16 ప్రభాతవార్త**



రామాపురం మండల బీజేపి నూతన అధ్యక్షులు గా చిర్రా విజయభాస్కర్ రెడ్డిని నిర్వహించినట్లు రాష్ట్ర కౌన్సిసలర్ మెంబర్ రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎ.వి.సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు శివగంగిరెడ్డిలు ఏకగ్రీవంగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ తనకు మండల అధ్యక్షునిగా నియమించిన బాధ్యతలు అప్పజెప్పిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మండలపరిధిలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఓబిసి ఉపాధ్యక్షుడు శివప్రసాద్, రాజశేఖర్ రెడ్డి, బిజేపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్‌కు పంతగాని నివాళి

**రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 16 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు మండలం లోని మైసూరువారిపల్లె మా జీ సర్పంచ్ డిటి మోహన్ శనివారం హత్య చేయబడిన విషయాన్ని తెలుసుకొన్న పంతగాని నరసింహప్రసాద్ ఆది వారం ఉదయం మోహన్ మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహన్‌తో ఎన్నో అవినాభావ సంబంధాలు ఉండేవని, మంచి వ్యక్తిత్వం కలిగిన మాజీ సర్పంచ్ అని ఆయన హత్య దారుణమైన విషయమని పంతగాని అన్నా రు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన అన్నారు. అనంతరం మోహన్ పార్థివదేహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈయన వెంట రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్, కూని చంద్రయ్య, కస్తూరి దినేష్, హరి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పీఎం కిసాన్ నిధులు విడుదల

**దువ్వూరు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**

మండలంలోని రైతులకు పీఎం కిసాన్, వైఎస్ఆర్ రైతు భరోసా నిధులను ప్రభుత్వం సోమవారం విడుదల చేస్తున్నట్లు వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఇందుకు గాను మైదుకూరులోని నంద్యాల రోడ్డులో ఉన్న కేవీసీసీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నారని జిల్లాకు సంబంధించి రూ.80కోట్ల మెగా చెక్కును జిల్లాలోని శాసనసభ్యులు, జిల్లా అధికారులు కలిసి విడుదల చేస్తారన్నారు. 4వ సంవత్సరం 2వ విడత రైతు భరోసా నిధులు, అలాగే పీఎం కిసాన్ 12వ విడత నిధులు రైతుల ఖాతాలో జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులందరూ మైదుకూరులో జరిగే సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

# నేడు గొల్లపల్లెలో గడప గడపకు

**దువ్వూరు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని చిన్నసింగనపల్లె గ్రామ పంచాయతీలోని గొల్లపల్లె, ఎల్లాలకొట్టాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొనాలని ఆయన తెలిపారు. ప్రజలు సమస్యలు ఉంటే కార్యక్రమంలో భాగంగా తెలపాలని ఆయన పేర్కొన్నారు.

# మైనరు బాలికపై సామూహిక అత్యాచారం

## నలుగురిపై ఫోక్సో కేసు నమోదు

## ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**బద్వేలు, అక్టోబరు 16 ప్రభాతవార్త :**

కడప జిల్లా గోపవరం మండలంలోని రాచాయపేట గ్రామానికి చెందిన మైనర్ బాలిక పై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన ఆలస్యంలో వెలుగులోకి వచ్చింది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థినితో అదే గ్రామానికి చెందిన నలుగురు మైనర్లు పరిచయం ఏర్పరచుకొని, ఒక రోజు బహిర్భూమి కోసం చెట్ల పొదలలోకి వెళ్ళగా అదే సమయంలో నలుగురు బాలురు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. అదే గ్రామానికి చెందిన నలుగురు మైనర్లు బాలిక పై అత్యాచారానికి పాల్పడడమే కాకుండా ఆ సంఘటనను సెల్ ఫోన్‌లో వీడియో తీశారు. సభ్య సమాజం తల దించుకునే ఈ సంఘటన 3 నెలల క్రితం జరిగినప్పటికీ బాధితురాలు అవమాన భారంతో గోప్యంగా ఉంచింది. నిందితులుగా ఉన్న మైనర్లు మాత్రం అత్యాచార ఘటనను వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఆడ బిడ్డ రోడ్డు మీదికి రావాలంటేనే కష్టతరంగా మారిందని, ఇంటి నుండి 10 అడుగులు దూరంలో ఉన్న బహిర్భూమికి వెళ్ళాలన్నా కష్టంగా మారిందని, ఇంతటి దురదృష్టకరమైన పరిస్థితి మరెక్కడా ఉండదేమో అని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. అంతే కాకుండా మైనర్లు పాల్పడిన సంఘటన దారుణమైనప్పటికీ వారి వెకిలి చేష్టలతో వీడియోలు తీసి పోస్టులు పెట్టడం ఏమిటని, వారిని కఠినంగా శిక్షించాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ నెల 13వ తేదీన బాధితురాలు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి నలుగురు మైనరు బాలుర్ల పై ఫోక్సో, అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం క్రింద కేసు నమోదు చేశారు. వీరిని కడప జువైనల్ కోర్టులో హాజరుపరిచారు. బాలికను కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. ఈ సంఘటనపై మహిళా సంఘాలతో పాటు పలువురు తీవ్రంగా స్పందించారు. మైనరు బాలికపై జరిగిన సంఘటన దారుణమని మండి పడ్డారు. బాలికకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను ఎవరైనా షేర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

# ఉపాధ్యాయులకు సన్మానం

**మదనపల్లెక్రైం, అక్టోబర్ 16 ప్రభాతవార్త :**

పట్టణంలోని హోప్‌స్కూల్‌లో పనిచేసిన ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు ఘన సన్మానం చేశారు. ఆదివారం హోప్‌స్కూల్‌లో 2002వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు నళిని మాట్లాడుతూ ఇప్పటికి 20ఏళ్ళు పూర్తిఅయినా చదివిన పాఠశాలను, ఉపాధ్యాయులను గుర్తుపెట్టుకొని సన్మానించడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, మరియమ్మ, విజయకుమారి, మనోహర్, గోపాల్, లూసి, భానుమతి, సుగుణమ్మ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

# కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తా

**ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి**

**కురబలకోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త :**



కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తానని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాండ్లమడుగు క్రాస్‌లోని అమరనారాయణ స్వామి కళ్యాణ మండపంలో కళాకారుల సమ్మేళన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాకారులకు గుర్తింపుకార్డులు, ఫించన్లు, అర్హులైన ఇండ్లులేని వారికి పక్కాగృహాలు మంజూరుకు కృషి చేస్తానన్నారు. తంబళ్ళపల్లె నియోజకవర్గ ప్రజలు తనను అఖండ మెజార్టీతో ఆదరించారని ఈ ధపా కూడా ఆదరించాలని ఆయన కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర జానపద సృజనాత్మకత కళల అకాడమి ఛైర్మెన్ కొండవీటి నాగభూషణం మాట్లాడుతూ కళాకారులకు 50సంవత్సరాలకే పించన్ మంజూరు కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెలుతానన్నారు. డప్పు కళాకారులకు వయో పరిమితిని తగ్గించేందుకు చర్యలుచేపడుతానన్నారు. లక్ష్మి వేంకటేశ్వర నాట్యకళామండలి ఛైర్మెన్ కత్తి రామలింగారెడ్డి, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సుధాకర్‌రెడ్డిలు కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే, ఛైర్మెన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో కురబలకోట ఎంపిపి దస్తగిరిసాబ్, మండల ప్రత్యేక ఆహ్వానితుల బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఆర్‌కె.క్రిష్ణారెడ్డి, నాగరత్న ఈశ్వర్, ప్రమీళమ్మ, ఎంపిటిసి రవీందర్‌రెడ్డి, ఛైర్మెన్ సురేంద్రరెడ్డి, నాయకులు ముస్తక్, బండి రాజశేఖర్, వాసు, ఎరుకులప్ప, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు. కళాకారులు కోలాట భజనలతో ఎమ్మెల్యే, ఛైర్మెన్‌లకు ఘన స్వాగతం పలికారు. కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి.

# గ్రామాల్లో సామాజిక తనిఖీలు

**కురబలకోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త:**

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నిర్వహించిన పనులను గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా బివిఓ యోగాంజనేయరెడ్డి చెప్పారు. ఆదివారం ఎంపిడిఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురబలకోట మండలంలో 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరానికి గానూ 977పనులకు గానూ రూ.6కోట్లుతో చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులపై సామాజిక తనికీలు ఈనెల 24వ తేది వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌పిపి రమణారెడ్డి, డిఆర్‌పిలు, ఏపిఓ వెంకటేష్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

# కోసువారిపల్లె గతుకుల రోడ్డు మరమ్మతు చేయండి

**తంబళ్లపల్లె, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రం నుంచి కోసువారిపల్లె రహదారి పూర్తిగా గుంతల మయమైంది. తంబళ్లపల్లె నుంచి పాపన్న చెరువుపల్లి వరకు రోడ్డు అధ్వానంగా తయారై ద్విచక్ర వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. కోసువారిపల్లె, బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీల నుంచి ప్రతి రోజూ వందల సంఖ్యలో జనాలు మండల కేంద్రానికి రాకపోకలు సాగించడం పరిపాటి. కోసువారిపల్లె, బలకవారిపల్లె నుంచి గత కొన్నేళ్లు క్రితం ఆర్టీసీ బస్ సర్వీసులు నడిచేవి. కాలక్రమేనా బస్సులు ఆగిపోవడంతో అద్దె ఆటోలు నడుస్తూ వచ్చేవి. ఈ మధ్య కాలంలో పాపన చెరువు పల్లె నుంచి తంబళ్లపల్లె వరకు రోడ్డు గుంతలమయవడంతో ఆటోలు సైతం తిరగడం లేదు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు రోడ్డు మరమ్మతులకు కృషి చేయాల్సి ఉంది. రోడ్డు పూర్తయి ఆర్టీసీ బస్ సర్వీసులు నడిపితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# జిల్లాకు 3 సైబర్ కవచ్ మోనిటర్లు

**– ఎలక్ట్రానిక్ గాడ్జెస్ మాల్వేర్ క్లినింగ్‌కు ఏర్పాటు**

**కడప క్రైం, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



అనేక మంది ప్రజలు ఉపయోగించే ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అయిన మొబైల్స్, పెన్‌డ్రైవ్‌లలో దాగి ఉన్న వైరస్, మాల్వేర్‌ను గుర్తించి తొలగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చయూపాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు సైబర్ కవచ్ మోనిటర్లను పంపిణీ చేస్తుండగా కడప జిల్లాకు 3 సైబర్ కవచ్ మోనిటర్లను కేటాయించింది. జిల్లాకు కేటాయించిన ఈ 3 మోనిటర్లలో ఒకటి దిశా పోలీస స్టేషన్‌లో, మరొకటి పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ సైబర్ కవచ్ ఏర్పాటు చేయడం జరుగుతున్నది. కడప దిశా పోలీసు స్టేషన్‌కు వచ్చిన సైబర్ కవచ్ మానిటర్లను కడప దిశ డీఎస్పీ వాసుదేవన్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర సీఎం ఈ సైబర్ కవచ్ మోనిటర్లను ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయిలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. మొబైల్స్ కానీ ఇతర ఎలక్ట్రానిక్ సపిరకాలలో దాగి ఉన్న వైరస్, మాల్వేర్‌తో పాటు మనకు తెలియకుండా ఇన్‌స్టాల్ అయిన అప్లికేషన్లు కూడా గుర్తించడం జరుగుతుందని తెలిపారు. వాటిని తొలగించడం చాలా సులభంగా ఉంటుందన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం ప్రజల్లో పబ్లిక్ ప్రాంతంలో ఉంచి వారి సమాచార రక్షణ కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల భవిష్యత్తులో ఇతరుల చేతుల్లోకి మన మొబైల్స్ యొక్క డేటా వెళ్లకుండాను, సైబర్ నేరాలు గురి కాకుండా రక్షించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంపై సీఆర్‌పీ బృందం పరిశీలన

**పెండ్లిమర్రి, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు, ఇసుకపల్లి వీఓలలోని లీడ్ ఫార్మర్ పంట పొలాలను ప్రకృతి వ్యవసాయంపై అనుభవం ఉన్న రైతు లీడ్ ఫార్మర్ పంట పొలాలను కడప జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆఫీసు నుంచి వచ్చిన సీఆర్‌పీ బృందం ఆదివారం పరిశీలించారు. ఈ పరిశీలనలో అర్హత పొందిన రైతులను ఐసీఆర్పీగా ఎంపిక చేస్తారని జనార్ధన్ ఎంసీఆర్పీ తెలిపారు. మండలంలోని ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మండల యాంకర్ పుల్లయ్య తెలిపారు.కార్యక్రమంలో ఎల్ఐసీఆర్పీలు శాంతి, విజయలక్ష్మీ, మల్లికార్జున, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్య నేరం

**వాల్మీకిపురం,అక్టోబర్ 16 :ప్రభాతవార్త**

బాల్య వివాహాలు చట్టరీత్య నేరం అని వాల్మీకిపురం జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్‌వి రామకృష్ణ అన్నారు.ఆదివారా స్థానిక గుర్రంకొండ రోడ్డులోని ఉర్దూ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు నిషేధిత చట్టం 2006 ప్రకారం 18 సంవత్సరాలలోపు ఆడ పిల్లలకి,21 సంవత్సరాలు మగ పిల్లలకు వివాహం చేయటం చట్టరీత్యా నేరం.బాల్య వివాహానికి అనుసరించిన, ప్రోత్సహించినా,నిర్వహించినా,జరగడానికి సహకరించినా,వివాహానికి హాజరైన వారందరిపైన నింధితులుగా పరిగణిస్తారు.ఈ నేరానికి సెక్షన్ 9,10,11, 9(1),13(10) ప్రకారం గరిష్టంగా 2సంవత్సరాలు జైలు శిక్ష,లక్ష రూపాయల జరిమానా లేదా రెండు విధించడం జరుగుతుంది.ఈ నేరానికి బెయిల్ కూడా లభించదు.చైల్డ్ హెల్ప్ కింద:1098 అని తెలియజేశారు.బాలికలు అందరూ చట్టాలపై అవగాహన వుండాలన్నారు.సమావేశంలో న్యాయవాదులు అశోక్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ మంజుల,న్యాయ సేవాధికారి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# యువకునిపై కత్తితో దాడి

**మదనపల్లెక్రైం, అక్టోబర్ 16 ప్రభాతవార్త :**

యువకునిపై మరో యువకుడు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన పట్టణంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. పట్టణంలోని రెడ్డీస్‌కాలనీకి చెందిన ఫారుఖాన్(25)నీరుగట్టువారిపల్లె పోర్‌వీలర్స్‌కు సంబంధించి స్పేర్‌పార్ట్స్ దుకాణాన్ని నడిపేవాడు. ఇతనిపై కురవంకకు చెదిన బంధువులు చేతబడి చేశారన్న అనుమానంతో ఇతను, తల్లి కలసి ఇమ్రాన్‌ఖాన్‌ను నిలదీశారు. దీంతో ఆగ్రహించిన ఇమ్రాన్‌ఖాన్, కుటుంబసభ్యులు తల్లి షాహీనా(48), తనయునిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ దాడిలో గాయపడిన వారిని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులుకేసు దర్యాప్తు చేస్తున్నారు.

# యూఐఎఫ్ ప్రోగ్రామ్‌కు మిట్స్ విద్యార్థులు ఎంపిక

**కురబలకోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త:**



అమెరికాలోని ప్రతిష్మాతకమైన స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటి ఇన్నోవేషన్ ఫెలో కార్యక్రమానికి మిట్స్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. బిటెక్ ద్వితీయసంవత్సరం చదువుతున్న దేశాయిరోహిత్‌రెడ్డి, దిన్నెమీద పవిత్ర, చిన్మయ్, సాయిస్ఫూర్తి, సాహినృత్యశ్రీ, రంగారెడ్డి ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. 2022-23 సంవత్సరంలో అమెరికాలోని స్టాన్‌పోర్డ్ యూనివర్శిటిని సందర్శించి ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకు తెలిపుకోవడం దం జరుగుతుందన్నారు. 5రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఒక వ్యాపార సంస్థ, కంపెనీని ఏర్పాటు చేయడానికి కావాల్సిన అంశాలను వివరించడం జరుగుతోందన్నారు. గూబుల్ హెడ్‌ఆఫీస్, మైక్రోసాఫ్ట్ హెడ్‌ఆఫీస్, ఆన్‌డ్రైడ్ హెడ్‌ఆఫీస్‌తో పాటు ఇతర సంస్థలను సందర్శించి అక్కడి ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇదివరకే మిట్స్ నుంచి 52మంది విద్యార్థులు ఈ ఇన్నోవేషన్‌ఫెలో కార్యక్రమానికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే 22మంది వరకు అక్కడికి వెళ్ళారని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎన్ విజయభాస్కర్‌చౌదరి, డైరెక్టర్ కీర్తినాదేళ్ళ, ప్రిన్సిపాల్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

# సత్వర న్యాయానికి న్యాయ విజ్ఞాన సదస్సులే కరదీపికలు

**– తంబళ్లపల్లె కోర్టు అడ్వకేట్ గఫార్**

**తంబళ్లపల్లె, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



నిరుపేద కక్షిదారుల సత్వర న్యాయం అందించడానికి న్యాయ విజ్ఞాన సదస్సులే కరదీపికలని తంబళ్లపల్లె మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు అడ్వకేట్ గఫార్ తెలిపారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రం రాగిమాను రచ్చ వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు చిన్న చిన్న సమస్యలతో పోలీసు స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలు తమ హక్కులను, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ఈ స్థాయి నుంచే చట్టాలు వాటి పర్యవసానాలు గుర్తించి అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఇప్పటికీ అందరికీ కేసులు నడుస్తున్న కక్షిదారులు తమ కేసులను సామరస్యంగా లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.న్యాయ విజ్ఞాన సదస్సులో కోర్టు సిబ్బంది శ్రీవాణి, ఇర్ఫాన్, సింగిల్‌విండో డైరెక్టర్ సాదిక్ బాషా, ప్రజలు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి వెళ్లాలంటే కాళ్లు తడవాల్సిందే

**తంబళ్లపల్లె, అక్టోబరు 16, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి రోజూ వం దల సంఖ్యలో ఓపీ రోగుల తో పాటు అత్యవసర కేసు లు వస్తూ ఉంటాయి. అయి తే గత నాలుగు రోజులుగా ఆసుపత్రి ప్రధాన రహదారి ముందు నీటి మడుగు ఏర్పడి రాకపోకలకు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాదిగా అదనపు భవన నిర్మానాలు జరుగుతు న్నాయి. ఇందులో భాగంగా వారం రోజుల క్రితం ఆసుపత్రి ముందు రోడ్డు నిర్మాణం చేపట్టడానికి సదరు ఆసుపత్రి కాంట్రాక్టరు సిబ్బంది ఆసుపత్రి ముందు జేసీబీతో అడుగు లోతు తవ్వించారు. రోడ్డు పని చేయకపోవడంతో ఆసుపత్రి ముందే ఈ మధ్య వస్తున్న వర్షాలకు వర్షపునీరు నిలిచిపోయింది. గత నాలుగు రోజలుగా నీటి మడుగు దారి మళ్లించడం కానీ రోగులకు ప్రత్యామ్నాయ రోడ్డు వేయడం కానీ జరగలేదు. దీంతో రోగులు విధి లేని పరిస్థితిలో ఆసుపత్రి వైద్యా నికి వర్షపు నీటి నుంచి వెళ్లక తప్పింది కాదు. రోగులతో పాటు ఆసుపత్రి సిబ్బం ది సైతం ఈ వర్షపు నీటిని దాటుకొని వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా సదరు కాంట్రాక్టరు సిబ్బంది స్పందించి నీటిని దారి మళ్లించాల్సి ఉంది.

# పేకాట స్థావరాలపై మెరుపు దాడి

**పోలీసు సిబ్బందిని అభినందించిన డిఎస్పీ**

**బద్వేలు, అక్టోబరు 16 ప్రభాతవార్త :**

నియోజకవర్గ పరిధిలోని బి.కోడూరు, అట్లూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో పోలీసులు మెరుపుదాడి చేసి 12 మంది పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 46 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. డిఎస్పీ వంశీధర్ గౌడ్ ఆదేశాల ప్రకారం సబ్ డివిజన్‌లోని ఐడీ పార్టీ సిబ్బంది నాగేంద్ర, భూపాల్ రెడ్డి, శివ, అమరేశ్వరరెడ్డి పేకాట స్థావరంపై దాడి చేశారు. బి.కోడూరు మండలం మేకవారిపల్లె సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేయగా 5 మంది పేకాట ఆడుతున్న వారితోపాటు 34 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే అట్లూరు సరిహద్దు ప్రాంతంలో 7 మంది పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 12 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏక కాలంలో సబ్ డివిజన్ ఐడీ పార్టీ సిబ్బంది పేకాట స్థావరాలపై దాడి చేసి అరెస్ట్ చేయడంతో డిఎస్పీ వంశీధర్‌గౌడ్ అభినందించారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయం చేయండి

– ప్రకృతి వ్యవసాయ పరిశీలనాధికారులు వేణి, సుమలత

జమ్మలమడుగు, అక్టోబరు 16, ప్రభాతవార్త:



రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వలన మంచి ఫలితాలను పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్స్ పరిశీలనాధికారులు వేని, సుమలత అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పి.బొమ్మేపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసే రామచంద్రయ్య రైతు పొలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప డీపీఎం రామకృష్ణ రాజు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల పంటలను పరిశీలిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఇక్కడికి వచ్చామన్నారు. పంట వేసేటప్పుడు బీజామృతంతో విత్తనశుద్ధి చేయాలని, అనంతరం ముందుగా తయారు చేసుకున్న ఘన జీవామృతం గల సేంద్రియ ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. పంట వేసిన 20 రోజులకు తెగులు సోకకుండా ముందు జాగ్రత్తగా నీమాస్త్రం, ద్రవ జీవామృతంతో పంటపై పిచికారి చేయాలన్నారు. ఒక వేల (పురుగు) తెగులు పడితే అందుకు తగ్గ కసాయాలు తయారు చేసుకొని పిచికారి చేయాలన్నారు. రసాయనికెరువులు వాడితే భూసారం తగ్గడమే కాక ఆహారం కూడా కలుషితం అవుతుందన్నారు. సేంద్రియ ఎరువులతో పండిన పంటకు గిట్టుబాటు ధరలు కూడా బాగా ఉంటాయన్నారు. గూడెం చెరువు, గండికోట ప్రాంతాలను పరివీలించామన్నారు. వరిలో కాకుండా ఇతర పంటలతో అంతర పంటలు వేసుకోవాలన్నారు.కార్యక్రమంలో రమేష్, రామాంజనేయరెడ్డి, రైతు రామచంద్రయ్య పాల్గొన్నారు.

## మూడు రాజధానులకు మద్దతుగా నేడు ర్యాలీ

పులివెందుల, అక్టోబరు 15, ప్రభాతవార్త :

పరిపాలన వికేంద్రీకరణ, మూడు రాజధానులకు మద్దతుగా సోమవారం పులివెందులలో వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు జశ్వంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్‌సీపీ నాయకులు తెలిపారు. ఉదయం 9.45 గంటలకు వైఎస్ఆర్ సర్కిల్ నుండి పూలంగళ్ల కూడలి వరకు ర్యాలీ ఉంటుందని వారు తెలిపారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బూత్ కమిటి సభ్యులు తప్పకుండా హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని వారు కోరారు.

## 32 మంది కంటిరోగులకు ఆపరేషన్‌లు

రాయచోటి రూరల్.అక్టోబర్ 16 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 32 మంది కంటి రోగులకు ఆపరేషన్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియోజకవర్గంలో పాటు రాజంపేట, రైల్వే కోడూరు, కె.వి.పల్లె, యర్రావారిపాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, చక్రాయపేట తదితర ప్రాంతాలనుంచి వచ్చిన 60 మంది కంటిరోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 32 మంది కంటి రోగులకు ఆపరేషన్‌లు చేశారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారుకార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవి స్వరూప గుప్తా, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాష, ఏపిఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, మహాలక్ష్మీ, శశిబిందు, ఆప్తమాలిక్, అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులపై దాడి చేయడం శోచనీయం

రామాపురం.అక్టోబర్ 16 ప్రభాతవార్త



విశాఖపట్టణంలో ఉత్తరాంధ్ర గర్జనకు వెళ్లిన మంత్రులు పై జనసేన సైనికులు దాడి చేయడం శోచనీయమని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సిపి ప్రచారకార ్యదర్శి జాకీర్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రప్రజలు మనోభావాలను గౌరవిస్తూ రాష్ట్ర మంత్రులు రోజా, జోగి రమేష్, వైవి సుబ్బారెడ్డి, విడదల రజినిలు గర్జనకు వెళ్లి తిరిగి వస్తుండగా విమానాశ్రయం వద్ద వాహనాలపై జనసేన కార్యకర్తలు దాడి చేయడం భాదాకరమన్నారు. వైసిపి కార్యకర్తలు తలచుకుంటే పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ఎక్కడా తిరగలేరని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహదేవరెడ్డి, షఫీ, ఇలియాజ్, ఖతీబ్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ సంక్షేమ సంఘానికి చేయూతనిస్తా

టిడిపి సీనియర్ నేత జగన్‌మోహన్‌రాజు

రాజంపేట అర్బన్, అక్టోబరు 16 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లాలోని కాకతీయ సంక్షేమ సంఘం ద్వారా పేదలకు తనవంతు చేయూతనిచ్చేందుకు ఎప్పుడు ముందుంటానని రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ సీనియర్ నేత చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొల్లపూటి శివనారాయణచౌదరి జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్‌చేసి ఆయన నివాసంలో అభినందించారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రాజు మాట్లాడుతూ కాకతీయ సేవాసమితి అధ్యక్షునిగా జిల్లాలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టిన తనవంతు సహకారం అందిస్తామన్నారు. గొల్లపూటి శివ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో సామాజికవర్గం పరంగా ప్రధానంగా విద్యార్థులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నదే తమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పతకమూరి బాబునాయుడు, గొల్లపూటి రమేష్‌నాయుడు, బాసినేని రెడ్డయ్యనాయుడు, వేణుగోపాల్‌నాయుడు, దొంతం శివ, రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, సిద్ధవటం మాజీ జడ్‌పిటిసి చలమయ్యయాదవ్, ఒంటిమిట్ట మాజీ ఎంపిపి లక్ష్మీనారాయణనాయుడు, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పోలి శివకుమార్, చమర్తి మధురాజు, గురు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీ సమావేశం

కడప, అక్టోబరు 16, ప్రభాతవార్త:



వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా గొరెండ్ల రమణయ్యను ఆదివారం రి మ్స్‌లోని నూతన బీసీ భవ నంలో ఏర్పాటు చేసిన కమి టీ సమావేశంలో ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఒర్సు బాలకొండయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.నారాయణ, ట్రెజరర్ కె.రామచంద్రయ్య, యువత అధ్యక్షులు నంద్యాల నాగరాజు (ఏ1 అంబులెన్స్), రాష్ట్ర నాయకుడు జానకీరాం, నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా సుబ్బరాయుడు, సెక్రటరీలు ఎం.సుబ్బరాయుడు, ఎన్.ఆదినారాయణరెడ్డి, బీసీ రాష్ట్ర నాయకులు ఖాదర్ బాసా, జిల్లా అధ్యక్షులు లింగమూర్తి తదితరులను నియమించడం జరిగింది.

## భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మట్టి రోడ్డు

జమ్మలమడుగు, అక్టోబరు 16, ప్రభాతవార్త:



తెదేపా జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మైలవరం ప్రాజెక్టు దగ్గర నుంచి మారెమ్మ గుడి మీదుగా నర్జోఇ కొట్టాల వరకు మట్టి రోడ్డును వేయించడం జరిగిందని తెదేపా కడప జిల్లా పారన్లమెంటు అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీను అన్నారు. ఆదివారం పొన్నతోట శ్రీను మాట్లాడుతూ పెన్నానది అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రయాణికులు ద్విచక్ర మరియు ఆటోలలో మైలవరం ప్రాజెక్టు కట్టపై వెళ్తున్నారన్నారు. ఆ రోడ్డు కూడా గుంతలు, బోటు రాళ్లు బయట పడి ప్రమాదానికి సూచికగా ఉన్నాయన్నారు. అందుకే గేట్లు దాటిన వెంటనే దిగువకు ఉన్న రోడ్డుకు ఎర్రమట్టి కంకర వేయడం జరిగిందన్నారు. దారి వెంబడి ఉన్న కంప చెట్లను రాళ్లను జేసీబీతో తొలగించి వేయడం జరిగిందన్నారు. ఈ రోడ్డు వలన ప్రయాణికులకు ఒక 4 కి.మీ దూరం కూడా తగ్గుతుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 19న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

– ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 16, ప్రభాతవార్త:

మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 19న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గ్రామీణ ఉపాధి, వ్యవసాయం, పౌర సరఫరాలు, విద్యా, వైద్యం, విద్యుత్తు, తాగునీరు, రవాణా తదితర అంశాలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఇంకా ఇతర అంశాలు ఏవైనా తమ దృష్టికి వస్తే మండల పరిషత్ అధ్యక్షుల అనుమతితో చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ

–ముగ్గురికి గాయాలు

సంబేపల్లె.అక్టోబర్ 16 ప్రభాతవార్త



కర్నూలు చిత్తూరు జాతీయ రహదారిలోని నారాయణరెడ్డిగారిపల్లె గ్రామం కొండవాండ్లపల్లె క్రాస్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయయ్యాయి. బాధితలు వివరాల మేరకు నారాయణ రెడ్డి పల్లె గ్రామం కొండవాండ్లపల్లెకి చెందిన కృష్ణ టివిఎస్ ఎక్సెల్ వాహనం నందు రాయచోటికి వస్తుండగా సంబేపల్లెకి చెందిన అంజలి, నాగార్జునలు తమ ద్విచక్రవాహనంలో గండి ఆంజనేయ స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఈ సంఘటన జరిగింది.గాయపడ్డవారిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంజలి తిమ్మాపురం క్రాస్‌నందు సచివాలయ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

## టిడిపి కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి

సంబేపల్లె.అక్టోబర్ 16 ప్రభాతవార్త



రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటామాని మాజీ ఎమ్మెల్యే రాయచోటి టిడిపి ఇన్‌చార్జ్ రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దుద్యాల గ్రామం నాయనివారిపల్లె కు చెందిన టిడిపి కార్యకర్త రవికుమార్ కుమారుడు దనుంజయ్ నాయుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం హాస్పిటల్ నుండి వారి స్వగృహానికి వచ్చిన విషయం తెలిసి రమేష్‌కుమార్ రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. త్వరలోనే పూర్తి స్థాయిలో సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబేపల్లె మాజీ జెడ్పీటిసి సరసారెడ్డి, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, రవినాయుడు, గంగాధర్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్‌లపై అధికారుల తనిఖీ

రైల్వేకోడూరు, అక్టోబరు 16 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలో పంచాయతికి చెందిన శానిటరి ఇన్‌స్పెక్టర్ నౌషద్‌అలీ పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్లాస్టిక్ కవర్ల నిషేదాన్ని కొనసాగించాలని లేనిపక్షంలో ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నవారికి జరిమానా విధిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా కవర్లు నిషేదంలో ప్రతిఒక్క యజమాని బాధ్యతగా విధులను నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు గ్రామ పంచాయతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మనిషి మనుగడకు, వాతావరణ మార్పుకు చెట్లే ప్రాధాన్యం

ఉత్తమ ఉపాధ్యాయురాలు పుష్పావతి

పీలేరు, కలకడ, అక్టోబరు 16, ప్రభాతవార్త:



మానవ మనుగడతో పాటు జంతువుల విన్యాసాలకు చెట్లే ప్రాధాన్యం అని ప్రభుత్వం నుండి ఉత్తమ ఉపాధయురాలుగా ఎంపిక అయినా పుష్పావతి అన్నారు. ఆమె వార్తతో మాట్లాడుతూ ప్రతి మనిషితో పాటు పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో పాటు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఒక చెట్టు చెప్పున నాటగలిగితే రాబోయే కాలానికి వృక్షాలుగా మారి ప్రాణ వాయువును అందించడమే కాకుండా మనిషి మనుగడకు వివిధ రకాల జంతువుల విన్యాసాలకు అనుగుణంగా ఉంటాయని ఆమె తెలిపారు. తన వంతు బాధ్యతతగా సొంత ఖర్చులతో ఇప్పటి వరకు పని చేసిన పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగించడం సంతృప్తిని ఇచ్చిందని దీనిని ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకొని పాఠశాలలు అధికారులు, అనది కారులు రోడ్లపక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తారని కోరుకుందాం.

## నేడు గాదెల సబ్ స్టేషన్‌లో విద్యుత్తుకు అంతరాయం

ఓబులవారిపల్లె, అక్టోబరు 16, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలం గాదెల పంచాయతీలో ఉన్న గాదెల సబ్ స్టేషన్ లో విద్యుత్తు మరమ్మతుల కోసం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని ఏడీ బాలాజీ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గాదెల సబ్ స్టేషన్లఓ కొన్ని ఫీడర్లకు సంబంధించి విద్యుత్తు లైన్లు, బ్రేకర్లు పాడైపోవడంతో వాటిని మరమ్మతు చేసేందుకు సోమవారం, మంగళవారం 2 రోజులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తామని ప్రజలు, రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ విజయ్‌కుమార్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ గంగయ్య, విద్యుత్తు లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి నాయకున్ని పరామర్శించిన బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

పోరుమామిళ్ళ రూరల్, అక్టోబర్ 16ప్రభాతవార్త:



పోరుమామిళ్ళలోని బెస్తవీధికి చెందిన షరీఫ్ కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది పోరుమామిళ్ళకు వచ్చారు. ఆదివారం విషయం తెలుసుకున్న బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ షరీఫ్‌ను పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను గురించి తెలుసుకోవడం జరిగింది. అధైర్యపడవద్దని తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ళ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నగిరి భైరవప్రసాద్, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగపు ఉపాధ్యక్షుడు రంతు, టిడిపి నాయకులు కె.వి.సుబ్బారెడ్డి, చెరుకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

– చిత్తా రవిప్రకాష్ రెడ్డి

పోరుమామిళ్ళ రూరల్, అక్టోబర్ 16ప్రభాతవార్త:



పోరుమామిళ్ళ మండలం రంగసముద్రం పంచాయతీలోని బ్లెస్డ్ బ్రెయాన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైందని మదర్ థెరిసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రవి ప్రకాష్‌రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ చిత్తా గిరి ప్రణీత్‌రెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి నగర్‌లోని బ్లెస్డ్ బ్రెయాన్ ఆసుపత్రిలో చేపట్టిన ఈ వైద్య శిబిరంలో ప్రముఖ న్యూరాలజిస్ట్, కడపలో ఎస్వీ నవీన్ నీరోకేర్ హాస్పిటల్ నిర్వాహకులు, తిరుపతి సిమ్స్ మాజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్వీ నవీన్ ప్రసాద్ వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. మెదడు, వెన్నుపూస, నరాలు, కండరాలు జబ్బులతో కీళ్ల నొప్పులతో బాధపడుతున్న దాదాపు 250 మందికి పైగా ఉచిత పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి వారానికి సరిపడా మందులు ఉచితంగా అందజేశారన్నారు. సేవలు అందించిన డాక్టర్ నవీన్‌ప్రసాద్‌ను శాలువతో సత్కరించి జ్ఞాపికను మదర్‌థెరిసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రంగసముద్రం సర్పంచ్ డాక్టర్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఓఎల్ఎఫ్ ప్రధాన ఉపాధ్యాయులు ఆరోగ్య రాణిలు అందజేశారు.కార్యక్రమంలో చిత్తా రాజానందరెడ్డి, జడ్పీటిసి ముత్యాల ప్రసాద్, ఎంపిటిసిలు కల్వకూరి రమణ, మహబూబ్ పీరా, బోరు రామసుబ్బారెడ్డి, బయన నాగేందర్ రెడ్డి, ప్రగతి శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో దాడులు చేయడం సరైన విధానం కాదు

కడప కార్పొరేషన్, అక్టోబరు 16, ప్రభాతవార్త:




మంత్రి రోజా, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, బీసీ నాయకులు జోగి రమేష్‌లపై దాడులు చేయడం దారుణమ ని సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పులి సునీల్‌కుమార్, కడప నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు షఫీలు అన్నారు. ప్రజాస్వామ్య విధానంలో ఇది సరైన విధానం కాదన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబు డైరెక్షన్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ యాక్షన్‌లో వారి కార్యకర్తలు ఈ దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దాడులను ఖండిస్తున్నామన్నారు. ఇలాగే మంత్రులపై, వైసీపీ నాయకులపై, మహిళలు, బీసీ నాయకులపై దాడులు చేస్తూ పోతే సహించేది లేదన్నారు. ఎదురుదాడులు తప్పవని హెచ్చరించారు. ఆదివారం కడప వైసీపీ కార్యాలయంలో పాత్రికేయులతో వారు మాట్లాడారు. గతంలో రాయలసీమ వాసులు రాజధానిని కోల్పోయారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ కోల్పోవడానికి సిద్ధంగా లేమన్నారు. మూడు రాజధానుల విధానాన్ని సమర్థించారు. అభివృద్ధి ఒకే ప్రాంతంలో కేంద్రీకీతం కాకుండా వికేంద్రీకరణ జరగాలని అభిప్రాయపడ్డారు. అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధి చేయడమే జగన్ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే దాడులు చేస్తున్నారని విమర్శించారు. ప్రతి ప్రాంతంలో పర్యటించే హక్కు అందరికీ ఉంటుందని, ఈ హక్కును కాలరాస్తే సహించేది లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, రాజకీయ దురుద్దేశంతో వైసీపీ నాయకులపై, మంత్రులపై, మహిళలపై, బీసీ నాయకులపై దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. దాడులు మళ్లీ పునరావృతం అయితే సహించేది లేదని, టీడీపీ, జనసేన నాయకులను హెచ్చరించారు. కార్యక్రమంలో వైసీపీ కడప నగర సేవాదళ్ అధ్యక్షులు ఖదీర్ అహ్మద్ పాల్గొన్నారు.

## పలువురిని ఎంపిపి పరామర్శ

నందలూరు, అక్టోబరు 16 ప్రభాతవార్త



నందలూరు మండలంలోని అరవపల్లె గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న ఎపిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ స్టేట్ డిప్యూటి జనరల్ సెక్రటరి గాదెన వెంకటనరసయ్యయాదవ్‌ను నందలూరు మండల అధ్యక్షుడు మేడా విజయభాస ్కర్‌రెడ్డి పరామర్శించారు. గత కొద్దిరోజుల క్రితం బాకరాపేట కుటుంబ సమేత ప్రమదానికి గురైన నరసయ్యను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా నరసయ్య కాలికి చిన్నపాటి సర్జరి జరిగిందని, త్వరలోనే అతను కోలుకొంటున్నారని ఆయన అన్నారు. అనంతరం మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ దనుంజయ్యనాయుడు తల్లి కాంతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. ఈ సందర్భంగా ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ధ్రాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కోఆప్షన్ సభ్యులు కలీమ్, తుమ్మల శ్రీధర్‌గౌడ్, స్థానిక వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బండెన్న స్వామికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, అక్టోబరు 16 ప్రభాతవార్త :



మండల పరిధిలోని పుట్టాయపల్లె పంచాయతీ సమీపంలో గల బండెన్న స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ వెలసి వున్న పొలతల మల్లిఖార్జున స్వామి, అక్క దేవతలకు కూడా ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అక్క దేవతల కథలను అర్చకులు కమలకూరు సాలయ్య వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సోమవారం నాడు మల్లిఖార్జున స్వామితో పాటు అక్క దేవతలకు కూడా ప్రత్యేక పూల అలంకారంతో వైభవంగా పూజలు నిర్వహిస్తుంటామని, అక్క దేవతల పూజకు గాను పలు ప్రాంతాల నుండి భక్తులు విరివిరిగా పాల్గొని పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకుంటారని అక్క దేవతల మాదిరిగానే ఇక్కడ కూడా అదే వైభవంగా అమ్మవార్లు వెలసి ఉన్నట్లు తెలిపారు. ఇక్కడ ఆంజనేయ స్వామి, సుబ్రమణ్యం స్వామి, నాగ దేవత, నందీశ్వరుడు, బండెన్న స్వామి, అక్కదేవతలతో పాటు పొలతల మల్లేశ్వర స్వామి వెలసి ఉన్నట్లు చిన్న వీర మల్లమ్మ, పెద్ద వీర మల్లమ్మ, సూర్య నాగమ్మ, చంద్ర నాగమ్మ, దేవకన్య, అగ్ని కన్య, నాగ మునెమ్మ దేవతలు వెలసి వచ్చిన భక్తుల పూజలందుకుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న స్వామి గురవయ్యతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డుపై అడ్డంగా వాహనాలు పెడితే చర్యలు తప్పవు

ఫుట్ పెట్రోలింగ్ ద్వారా ట్రాఫిక్‌పై అవగాహన

బద్వేలు అర్బన్, అక్టోబరు 16 ప్రభాతవార్త :



వాహనదారులు రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపి ట్రాఫిక్ అంతరాయానికి గురైతే వారిపై జరిమానా విధిస్తామని అర్బన్ ఎస్ఐ కత్తి వెంకటరమణ అన్నారు. ఆదివారం పట్టణంలో ఎస్ఐ కత్తి వెంకటరమణ పోలీసు సిబ్బందితో కలిసి ప్రధాన రహదారులలో ఫుట్ పెట్రోలింగ్ చేపట్టి దుకాణాల యజమానులకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై పలు రకాల సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటరమణ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, తోపుడు బండ్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం వలన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందన్నారు. దుకాణాల యజమానులు కూడా షాపుల ముందు వాహనాలు నిలపకుండా చూసుకోవాలన్నారు. వాహనదారులు ఎప్పటికప్పుడు రికార్డులను సరిచూసుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, మైనర్ బాలికలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. పట్టణంలో రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాలు కూడా ఎక్కువయ్యాయని, కావున ప్రతి ఒక్కరూ పోలీసు చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు అనుసరించి సహకరించాలని ఫుట్ పెట్రోలింగ్ ద్వారా పలువురికి సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జేఏసి సదస్సు జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్, అక్టోబరు 16 ప్రభాతవార్త :



ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీలపై జరుగుతున్న దాడులను, అరాచకాలను అణిచివేతలను నివారించేందుకు 27న దళితుల సంక్షేమ పథకాలు తిరిగి ఇవ్వాలని, దళితులకు వజ్రాయుధమైనటువంటి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు 41 భారీ సిఆర్పీ నోటిఫికేషన్ ఇవ్వడం ఆపి అట్రాసిఫికేషన్ మొదలైన వెంటనే అరెస్ట్ చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీ విద్యార్థులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలని, సాగులో ఉన్న దళితుల భూములకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఈ నెల 30న కడప ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఎస్సీ, ఎస్టీ జేఏసీ సదస్సును జయప్రదం చేయాలని, ఏపి దళిత రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగిపోగు చిన్నయ్య, దళిత నాయకులు రాంబాబు, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి అధ్యక్షులు ముండ్లపాటి పిచ్చయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు రాంబాబు, శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం మహా దానం

నిరాశ్రయుల వసతిగృహం నందు అన్నదానం

బద్వేలు అర్బన్, అక్టోబరు 16 ప్రభాతవార్త :



పట్టణంలోని తెలుగు గంగ కాలనీలో ఉండే ఆనంద నిలయం నిరాశ్రయుల వసతిగృహం నందు ఆదివారం మధ్యాహ్నం కీ॥శే॥ ఆవుల సుబ్బరాయుడు వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు ఆవుల వెంకట్, ఉపాధ్యాయుడు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం మహా దానం అని, అనేక కారణాలతో నిరాశ్రయుల ఆశ్రమాన్ని ఆశ్రయించిన వృద్ధులను ఆదరించి వారికి అన్ని విధాలా పరిచర్యలు చేస్తూ ఆదుకోవడం మంచి సామాజిక ఉత్తమ సేవ అని కొనియాడారు. అనంతరం అన్నదానం చేయడం అన్ని దానాలలో కన్నా అన్నదానం మహా దానం అని పేర్కొన్నారు. పట్టణంలోని దాతలు ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఉద్దేశ్యపూర్వకమైన కారణాలతో తమ వంతు సహాయ సహకారాలు అనాధలైనటువంటి వృద్ధులకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారి తండ్రి కీ॥శే॥ సుబ్బరాయుడు జ్ఞాపకార్థం ఆశ్రమానికి 2 సీలింగ్ ఫ్యాన్లు, 2 బార్ లైట్లు ఆశ్రమ నిర్వాహకులు పిడతల రవి కుమార్‌కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బుడుగుంటపల్లె రైల్వేగేటు 2 రోజులు మూత

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 16 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని కె.బుడుగుంటపల్లె రైల్వేగేటును సంబంధిత రైల్వే అధికారులు ఈనెల 19, 20న మూసివేస్తున్నట్లు సంబంధిత రైల్వే అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే పనుల నిమిత్తం రైల్వేగేటును మూసివేస్తున్నామని వారు పేర్కొన్నారు. సంబంధిత ప్రజలు, కళాశాల విద్యార్థులు, మార్కెట్ యాజమాన్యం తదితరులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

## పేకాట స్థావరాలపై మెరుపు దాడులు

7 మంది అరెస్ట్, రూ.12130 లు నగదు స్వాధీనం

బద్వేలు రూరల్, అక్టోబరు 16 ప్రభాతవార్త :



బద్వేలు రూరల్ పరిధిలోని పలు చోట్ల మైదుకూరు డిఎస్పీ వంశీధర్ గౌడ్ ఆదేశాల మేరకు బద్వేలు రూరల్ సర్కిల్ పరిధిలోని పేట స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ చంద్ర శేఖర్ తెలిపారు. మండల పరిధిలోని పుట్టాయపల్లె, గొడుగునూరు, బయనపల్లె గ్రామాలతో పాటు పలు గ్రామాలలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి పుట్టాయపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న 7 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 12130 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ బెట్టింగ్‌లు, జూదం, అక్రమ మద్యం, పేకాట లాంటి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

బి.కోడూరు మండలం మేకవారిపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర పేకాట స్థావరంపై పోలీసు సిబ్బందితో దాడులు నిర్వహించి 5 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 34130 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు బి.కోడూరు మండల ఇన్‌ఛార్జ్ ఎస్ఐ చంద్ర శేఖర్ తెలిపారు.

## 5 రోజుల పాటు గేటు మూసివేత

నందలూరు, అక్టోబరు 16 ప్రభాతవార్త

నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె – అరవపల్లె మధ్యలో ఉన్న రైల్వేగేటు ఈనెల 17వ తేది నుండి 22వ తేది వరకు రాత్రి గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మూసివేస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజనీరు పి.సురేష్‌కుమార్ తెలిపారు. ఎల్‌సి గేటు(111) ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా 5 రోజుల పాటు మూసివేస్తున్నామన్నారు. వాహనదారులు, ప్రజలు రైల్వేగేటు సమీపంలో ఉన్న ఆర్‌యుబిని ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. భారీ వాహనాల రాకపోకలకు ఉదయం మాత్రమే అనుమతి ఇస్తారని, రాత్రిపూట అనుమతి ఉండదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.